RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

Gk MEDIA
కావలెను
ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పనిచేయుటకు
జిల్లాల వారిగా
స్టాఫ్ రిపోర్టర్స్, రిపోర్టర్స్ కావలెను
సంప్రదించవలసిన నెం:
9696571571
GK Media Broadcasting Network

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 9, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 27 - ఫిబ్రవరి - 2026 , వెల రూ.5/-

## 2022లో హెచ్ఎఫ్ఎల్ నుంచి వీఎస్ఆర్ వెంచర్స్ రుణం తీసుకుంది



2లో

- బాబాయ్‌ని చంపి కత్తి మా చేతిలో పెట్టారు
- వీఎస్ఆర్‌ను హెరిటేజ్‌కు ముడిపెట్టడమూ అలాంటిదే
- మా ఎంపీ కేంద్ర మంత్రి అవుతారని... అజిత్‌పవార్ వీఎస్ఆర్ విమానంలో ప్రయాణిస్తారని కలగన్నామా?
- మంత్రి లోకేశ్ ధ్వజం



## గంగా-కావేరి అనుసంధానం
## నా ప్రగాఢ ఆకాంక్ష: చంద్రబాబు

- పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణాకు తీసుకొచ్చాం.
- ప్రాజెక్టుల పూర్తికి బ్లూ ప్రింట్ సిద్ధం చేస్తున్నాం
- ప్రకృతిని ఆరాధించడం.. నీటిని పూజించే సంప్రదాయం మనది
- " ఏ పనైనా చిన్న ఆలోచనతోనే మొదలవుతుంది
- గంగా-కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు

2లో

## అసెంబ్లీకి రారు కానీ అసెంబ్లీలో
# ప్రతిపక్ష హోదా కావాలంటారు

- ★గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంస జరిగింది
- ★ఆనాడు బాబాయ్ ని చంపేసి మరుసటి రోజు సాక్షి పత్రికలో నారా సుర రక్త చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టాడు
- ★ప్రాజెక్టు పూర్తి కాకుండానే వైసీపీలా రిబ్బన్ కటింగ్ చేసి దొంగ నాటకాలు ఆడటం మాకు చేతకాదు
- ★గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చారని విమర్శ
- ★రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన



అమరావతి: "గత పాలకులు చేయని అపచారం లేదు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారు. కెమికల్స్ కలిపిన నెయ్యితో లడ్డూలు చేసి విక్రయించారు. ఆ నెపాన్ని హెరిటేజ్ పై మోపారు. ఆనాడు బాబాయ్ ని చంపేసి మరుసటి రోజు సాక్షి పత్రికలో నారా సుర రక్త చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టాడు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడతారు. నా తల్లి, భార్య, మా పార్టీ నేతలను ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రారు కానీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటారు. మిగతా.. 2లో

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ..

జీఏడీ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా




హైదరాబాద్: తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది

# త్వరలో గ్రామీణ ప్రాంత యూనిట్లు

## కేంద్ర నిధులు వస్తే ఖజానాకు పెద్ద ఊరట

- రాష్ట్రానికి రూ.2,160 కోట్ల 'ఇందిరమ్మ' నిధులు!
- 3 లక్షల పీఎంఏవై గ్రామీణ యూనిట్ల మంజూరుకు చాన్స్
- మార్చి రెండో వారంలోగా స్పష్టత
- 1.3 లక్షల యూనిట్లు మంజూరు కావటంతో, దానికి సంబంధించి రూ.1,695 కోట్లు




హైదరాబాద్: ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకోవటంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్రం అందించే నిధుల్లో క్రమంగా స్పష్టత వస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం (పీఎంఏవై) కింద రాష్ట్రానికి ఈ నిధులు అందించాల్సి ఉంది. ఇప్పటికే ఆ పథకం కింద పట్టణ ప్రాంత ఇళ్లను కేంద్రం మంజూరు చేసిన విషయం తెలిసిందే. 1.3 లక్షల యూనిట్లు మంజూరు కావటంతో, దానికి సంబంధించి రూ.1,695 కోట్లు అందనున్నాయి. ఇక ప్రధానంగా ఆశ పెట్టుకున్న గ్రామీణ ప్రాంత యూనిట్లపై స్పష్టత రావాల్సి ఉంది. 3 లక్షల యూనిట్లు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచింది. ఆ మేరకు 3 లక్షల యూనిట్లు మంజూరయ్యే అవకాశం కనిపిస్తుండగా, అదే జరిగితే మరో రూ.2,160 కోట్లు అందనున్నాయి. ఇది ఇందిరమ్మ పథకం కొనసాగింపులో రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఊరట ఇవ్వనుంది. మిగతా.. 2లో

## మా కష్టార్జితం..
# మా కన్నీళ్లు..

కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం లేకుండా పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది




కేటీఆర్‌తో వెలుగుమట్ల బాధితులు

రూపాయి రూపాయి కూడబెట్టి కట్టుకున్న ఇండ్లను కూల్చేస్తున్నారు

హైదరాబాద్: ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో

## బిల్ గేట్స్ వ్యవహారంపై మస్క్ సంచలన వ్యాఖ్యలు

"కర్మ ఈజ్ రియల్" అంటూ కామెంట్ చేసిన టెస్లా చీఫ్



2లో

- రష్యన్ మహిళలతో బిల్ గేట్స్ అఫైర్స్ వార్తలపై కామెంట్
- టెస్లా షేర్లపై రూ.4 వేల కోట్ల బెట్టింగ్ చేసిన గేట్స్ పై ఆగ్రహం

## వారం రోజుల్లో కొత్త పార్టీ
# పేరు ప్రకటిస్తాం

- రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్న చిన్నమ్మ
- ఎన్నికల పొత్తుల కోసం కొన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడి
- తమిళనాడు ప్రజలకు తాను సుపరిచితురాలినేనని ధీమా
- సీపీఐ నేత నల్లకన్ను మృతికి సంతాపం.. ఆయన సేవలను కొనియాడిన శశికళ



తమిళనాడు: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వి.కె. శశికళ తన రాజకీయ పునరాగమనాన్ని ఖాయం చేస్తూ కీలక ప్రకటన చేశారు. వారం రోజుల్లో తన కొత్త రాజకీయ పార్టీ పేరును వెల్లడిస్తానని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ మిగతా.. 2లో

# ప్రధాని మోదీకి అరుదైన గౌరవం..

- ఇజ్రాయెల్, పాలస్తీనాల నుంచి అత్యున్నత పురస్కారాలు
- పార్లమెంట్ 'నెస్సెట్' నుంచి ప్రత్యేక మెడల్ అందుకున్న తొలి వ్యక్తిగా రికార్డు
- 2018లో పాలస్తీనా అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ కాలర్' స్వీకరణ
- ఇరు దేశాల నుంచి పురస్కారాలు పొందిన అరుదైన ప్రపంచ నేతగా గుర్తింపు
- వినయంతో పురస్కారాన్ని స్వీకరిస్తున్నట్లు తెలిపిన ప్రధాని మోదీ



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ఇజ్రాయెల్, పాలస్తీనా.. ఈ రెండు దేశాల నుంచి అత్యున్నత పౌర పురస్కారాలు అందుకున్న అతి కొద్దిమంది ప్రపంచ నాయకుల మిగతా.. 2లో


# వయనాడ్‌లో 100 ఇళ్లు...
## 40 మంది దుకాణదారులకు
## రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం

- వయనాడ్ కొండచరియల బాధితులకు 100 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- భూమిపూజ చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్, వయనాడ్ ఎంపీ ప్రియాంక
- వయనాడ్ ప్రజల కుటుంబంలో ఒకరినయ్యా
- వయనాడ్‌తో తమది రాజకీయాలకు అతీతమైన బంధమని స్పష్టం చేసిన రాహుల్



వయనాడ్: కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ మిగతా.. 2లో

## న్యాయవ్యవస్థపై ఎన్‌సీఈఆర్‌టీ 'కుట్ర'..
# సుప్రీంకోర్టు సంచలన తీర్పు!




2లో

- వివాదాస్పద పాఠ్యపుస్తకంపై తక్షణ నిషేధం
- న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోందంటూ సీజేఐ ఆగ్రహం
- బేషరతుగా క్షమాపణలు చెప్పిన కేంద్రం
- అవినీతి పాఠ్యాంశంపై కఠిన చర్యలు.. మార్చి 11న తదుపరి విచారణకు ఆదేశం

## సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశం..
## ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాల్సిందే!



2లో

కంటెంట్ క్రియేటర్లతో ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాలని సోషల్ మీడియాకు కేంద్ర

## 2022లో హెచ్ఎఫ్ఎల్ నుంచి
# వీఎస్ఆర్ వెంచర్స్ రుణం తీసుకుంది

, అమరావతి: 'బాబాయ్‌ని చంపి కత్తి మా చేతిలో పెట్టారు. ఇప్పుడు వీఎస్ఆర్ ఏవియేషన్ సంస్థకు, హెరిటేజ్‌కు ముడిపెడుతూ వైకాపా నాయకులు చేస్తున్న ఆరోపణలూ అలాంటివే' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. హెరిటేజ్‌కు, వీఎస్ఆర్ ఏవియేషన్‌కూ ఎలాంటి సంబంధం లేదన్నారు. శాసనసభ లాబీలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "హెరిటేజ్ ఫిన్‌లీజ్ (హెచ్ఎఫ్ఎల్) నుంచి వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థ 2022, 2023 సంవత్సరాల్లో రుణం తీసుకుంది. హెచ్ఎఫ్ఎల్ 1996లో రిజర్వుబ్యాంకు మార్గదర్శకాల ప్రకారం ఏర్పాటైన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ). ఆ సంస్థ వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలు, అడ్వాన్సులు ఇస్తుంది. హెచ్ఎఫ్ఎల్ నుంచి రుణం తీసుకున్న సంస్థలు, వ్యక్తులు సుమారు 10వేల మంది ఉంటారు. వారిలో వీఎస్ఆర్ వెంచర్స్ ఒకటి. వీఎస్ఆర్ వెంచర్స్ మొత్తం రుణాల్లో.. హెచ్ఎఫ్ఎల్ నుంచి తీసుకుంది ఆరు శాతమే' అని లోకేశ్ తెలిపారు. 'ఆ సంస్థకు రుణం ఇచ్చినప్పుడు.. మేం అధికారంలోకి వస్తామని, మా ఎంపీ రామ్మోహన్‌నాయుడు పౌరవిమానయానశాఖ మంత్రి అవుతారని, వీఎస్ఆర్ కంపెనీకి చెందిన విమానంలో అజిత్ పవార్ ప్రయాణిస్తారని, అది ప్రమాదానికి గురవుతుందని కలగన్నామా? మేమేమన్నా జ్యోతిష్యులమా?' అని లోకేశ్ ప్రశ్నించారు. జగన్, ఆయన పత్రిక సాక్షి చేసే ప్రతి నిరాధార ఆరోపణకూ తాను సమాధానం చెప్పాల్సిన పనిలేదని, స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్న ప్రతి ప్రశ్నకూ దీటైన సమాధానం చెబుతామని తెలిపారు. చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగల్ని వదిలేస్తున్నారంటూ ప్రభుత్వంపై శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యల గురించి విలేకరులు ప్రస్తావించగా.. 'అంటే జగన్ గజదొంగని, ఆయనను పట్టుకోవాలని బొత్స చెబుతున్నారా' అని లోకేశ్ బదులిచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తమ పార్టీ నాయకులపై ఫైబర్‌నెట్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, మద్యం, ఇసుక, ఎసైన్డ్ భూములకు సంబంధించి దొంగ కేసులు పెట్టారని లోకేశ్ ధ్వజమెత్తారు. 'ఛార్జిషీటు దాఖలు చేసేటప్పుడు కాంపిటెంట్ అథారిటీ నుంచి అనుమతి పొందాలి. మంత్రులైతే గవర్నర్, ఎమ్మెల్యేలైతే స్పీకర్ నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ ఒక్క ఆధారమైనా చూపారా? వారు పెట్టినవన్నీ తప్పుడు కేసులు' అని లోకేశ్ ధ్వజమెత్తారు. పార్టీ కార్యాలయాన్ని ఒక యూనివర్సిటీలా మార్చేశామని, సంవత్సరమంతా ఇక్కడ ఎప్పుడూ ఎవరికో ఒకరికి శిక్షణ తరగతులు జరుగుతూనే ఉంటాయని లోకేశ్ తెలిపారు. త్వరలో ఎమ్మెల్యేలకు రెండు రోజులపాటు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తామన్నారు. రెసిడెన్షియల్ స్కూల్‌లో మాదిరిగా.. ఎమ్మెల్యేలు రెండు రోజులు పూర్తి సమయం పార్టీ కార్యాలయంలోనే ఉండాలని ఆయన చెప్పారు. దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రిన్సిపల్ కాగా.. తామంతా విద్యార్థులమని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాలవారీగా పార్టీ ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తాను నిర్వహిస్తున్న భేటీలు... పూర్తిగా కుటుంబ సమావేశాల్లానే జరుగుతున్నాయని, వాటిలో రాజకీయాల గురించి అసలు ప్రస్తావించడం లేదని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాయకుల్లో సగం మందివి ప్రేమవివాహాలే అని తెలిసి బాగా నవ్వుకున్నానని చెప్పారు.

## గంగా-కావేరి అనుసంధానం
# నా ప్రగాఢ ఆకాంక్ష: చంద్రబాబు

అమరావతి: ప్రకృతిని ఆరాధించడం.. నీటిని పూజించే సంప్రదాయం మనదని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరికి అఖండ హారతి ఇచ్చామని, కృష్ణకు పవిత్ర హారతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. నదులను పూజించడం సంప్రదాయంగా పెట్టుకున్నామని తెలిపారు. సాగునీటి రంగంపై సీఎం చంద్రబాబు శాసనసభలో మాట్లాడారు. గంగా- కావేరి అనుసంధానం కావాలనేది నా ప్రగాఢ ఆకాంక్ష అని చెప్పారు. " ఏ పనైనా చిన్న ఆలోచనతోనే మొదలవుతుంది. గంగా-కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయి. నదుల అనుసంధానం చేసి తెలుగుతల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత మాది. నదుల అనుసంధానం వల్ల నీటి సమస్యలు తగ్గుతాయి. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులన్నీ ఎన్డీయే లేదా తెదేపా హయాంలోనే జరిగాయి. పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణకు తీసుకొచ్చాం. వెలిగొండ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా... నేనే పూర్తి చేస్తున్నా. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటున్నారు. గోదావరి జిల్లాల్లో కాటన్ దొర విగ్రహాలు పెట్టి పూజిస్తున్నారు" అని చంద్రబాబు అన్నారు.

ప్రాజెక్టుల పూర్తికి బ్లూ ప్రింట్ సిద్ధం చేస్తున్నాం: చంద్రబాబు

పోలవరం-నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళ్లే వరద జలాలను తరలిస్తాం. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. అందుకు మేం అభ్యంతరం చెప్పలేదు. ఆ ప్రాజెక్టు వల్ల తెలుగు రాష్ట్రాలకు లాభం. పోలవరం డయాఫ్రంవాల్ కొట్టుకుపోతే గుర్తించలేని పరిస్థితి గత పాలకులది. చేయని నేరానికి నన్ను గత పాలకులు.. 53 రోజులు పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నా. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్లాడుకుంటున్నాయో చూశాం. నీరు పుష్కలంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యలను తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్‌సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నా. సాగునీరు, పరిశ్రమలకు నీరు, ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యం సాధించినట్లే. తెలుగుతల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పం. రాష్ట్రంలో ప్రాజెక్టుల పూర్తికి బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు.

# మా కష్టార్జితం.. మా కన్నీళ్లు..

హైదరాబాద్: ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను రేవంత్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం లేకుండా పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. బాధితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ల బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా 4 వేల మంది పోలీసులతో వచ్చారు. పేద ప్రజలు ఏం చేస్తారు వచ్చి కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి కట్టుకున్న ఇండ్లను కూల్చేస్తున్నారు సార్ అంటూ కేటీఆర్‌తో ఓ యువతి అక్కడి వారి ఆవేదనను పంచుకుంది. మా ప్రతీ భూమికి పట్టాలున్నాయి. నా ఆరో తరగతి నుంచి నేనిక్కడే ఉంటున్నా.. ఇక్కడే 10వ తరగతి కూడా పూర్తయింది. మా నాన్న కూలీకెళ్తరు. మేమిక్కడే ఉంటున్నాం.. కోర్టు ఆర్డర్లను కూడా ధిక్కరించి ఈ ప్రభుత్వం ఇలా చేస్తుంది. మీకు కూలగొట్టిన ప్రతీ ఇల్లు చూపిస్తాం. మా కష్టార్జితం.. మా కన్నీళ్లు.. మా ఆశలు.. అంటూ ఆవేదన వ్యక్తం చేసింది.

## బిల్ గేట్స్ వ్యవహారంపై మస్క్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: టెక్ దిగ్గజాలు ఎలాన్ మస్క్ మరియు బిల్ గేట్స్ మధ్య విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ గతంలో వివాదాస్పద వ్యక్తి జెఫ్రీ ఎప్ స్టీన్ తో సంబంధాలు కలిగి ఉన్నారనే వార్తలు, అలాగే ఇద్దరు రష్యన్ మహిళలతో ఆయనకున్న అఫైర్లపై తాజాగా న్యూయార్క్ టైమ్స్ ఒక నివేదికను వెలువరించింది. ఈ నేపథ్యంలో ఎక్స్ (ట్విట్టర్) యూజర్ ఒకరు పెట్టిన పోస్ట్‌కు "ఖుతీఖు అం తీఖుశ్రీ" (కర్మ అనేది నిజం) అంటూ మస్క్ కామెంట్ పెట్టారు.

టెస్లాపై బిల్ గేట్స్ షార్ట్ సెల్లింగ్..

బిల్ గేట్స్ గతంలో టెస్లా కంపెనీ షేర్ల విలువ పడిపోతుందంటూ సుమారు 500 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,150 కోట్లు) 'షార్ట్ పొజిషన్' తీసుకున్నారు. దీనిని ఉటంకిస్తూ ఒక యూజర్.. "టెస్లా షార్ట్ సెల్లర్లకు నైతిక విలువలు ఉండవని ఇప్పుడే అర్థమైంది" అని పోస్ట్ చేశారు. దీనికి మస్క్ 'కర్మ' గురించి ప్రస్తావిస్తూ గేట్స్ వ్యక్తిగత వివాదాలను ఎద్దేవా చేశారు.

అసలు గొడవ ఎక్కడ మొదలైందంటే..

వీరిద్దరి మధ్య ఘర్షణకు ప్రధాన కారణం టెస్లా స్టాక్ మార్కెట్ బెట్టింగ్. దీనిపై గతంలో ఒక ఇంటర్వ్యూలో గేట్స్ మాట్లాడుతూ.. తాను షార్ట్ పొజిషన్ తీసుకున్న విషయంపై మస్క్ తనకు నేరుగా మెసేజ్ చేసి నిలదీశారని ఒప్పుకున్నారు. అదేసమయంలో ఏదైనా స్వచ్ఛంద కార్యక్రమం కలిసి చేద్దామా అని గేట్స్ అడగ్గా.. మస్క్ నిర్మొహమాటంగా తిరస్కరించారు. "పర్యావరణాన్ని కాపాడే టెస్లా కంపెనీ పతనం కావాలని కోరుకుంటూ, మళ్లీ పర్యావరణం కోసం కలిసి పని చేద్దామనడం హాస్యాస్పదం.. మీ మాటలను నేను సీరియస్‌గా తీసుకోలేను" అని మస్క్ బదులిచ్చారు.

గేట్స్ దివాళా తీయడం ఖాయం..

గత ఎనిమిదేళ్లుగా గేట్స్ టెస్లాపై ఈ 'క్రేజీ' షార్ట్ పొజిషన్‌ను కొనసాగిస్తున్నారని మస్క్ మండిపడ్డారు. "ఒకవేళ టెస్లా ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఎదిగితే, ఆ షార్ట్ పొజిషన్ వల్ల బిల్ గేట్స్ వంటి కుబేరుడు కూడా దివాళా తీయడం ఖాయం" అని మస్క్ హెచ్చరించారు.

## సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశం..
## ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాల్సిందే!

ఢిల్లీ: సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తమ ఆదాయాన్ని కంటెంట్ సృష్టించేవారితో న్యాయబద్ధంగా పంచుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. జర్నలిస్టులు, సంప్రదాయ మీడియా సంస్థలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, విద్యావేత్తలు, పరిశోధకులు ఇలా ఎవరైనా సరే, కంటెంట్ సృష్టిస్తే వారికి ఆదాయంలో సరైన వాటా దక్కాల్సిందేనని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్లాట్‌ఫామ్‌లు ఇతరులు అప్‌లోడ్ చేసే కంటెంట్ ద్వారా గణనీయంగా ప్రయోజనం పొందుతున్నాయని, అందుకే కంటెంట్ సృష్టికర్తలకు కూడా వారి సరైన వాటా దక్కాలని ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోని కంటెంట్ క్రియేటర్ల నుంచి మొదలుకొని, తమ పరిశోధనలను పంచుకునే ప్రొఫెసర్ల వరకు అందరికీ ఈ న్యాయం జరగాలన్నారు. ఆదాయ పంపిణీలో న్యాయబద్ధతను తీసుకురావడం ద్వారా దేశంలో డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేస్తున్న తరుణంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే.. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ గతేడాది ఐటీ రూల్స్-20కి కీలక సవరణలు ప్రతిపాదించింది. పెరిగిపోతున్న డీప్‌ఫేక్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించిన తప్పుడు సమాచారాన్ని అరికట్టడమే ఈ సవరణల లక్ష్యం. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్ వంటి పెద్ద సోషల్ మీడియా సంస్థలు (50 లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నవి) ఏఐ ఆధారిత కంటెంట్‌ను స్పష్టంగా లేబుల్ చేయాలి. వీడియోలు లేదా చిత్రాలైతే కనీసం 10 శాతం డిస్‌ప్లేను, ఆడియో అయితే మొదటి 10 శాతం వ్యవధిని ఈ లేబుల్ కవర్ చేయాలి. ఈ కంటెంట్‌కు శాశ్వత మెటాడేటా లేదా ఐడెంటిఫైయర్ జోడించాలని, దానిని మార్చడానికి లేదా తొలగించడానికి వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ ఏదైనా ప్లాట్‌ఫామ్ ఉద్దేశపూర్వకంగా లేబుల్ లేని ఏఐ కంటెంట్‌ను అనుమతిస్తే, అది ఐటీ చట్టం ప్రకారం 'తగిన శ్రద్ధ' పాటించడంలో విఫలమైనట్లు పరిగణించబడుతుంది.

# అసెంబ్లీకి రారు కానీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటారు

మొదటి పేజి తరువాయి

వాళ్లు బెదిరిస్తే ఇవ్వాలా. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేస్తేనే ఏదైనా సాధ్యం అని కూడా వారికి తెలీదా? గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంస జరిగింది. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడ్డారు. గంజాయి, భూ కబ్జాలు, దౌర్జన్యాలతో హడలిపోయారు. నేను ఎవరు తిట్టినా లెక్కపెట్టుకోను. నేను జీవిస్తోంది ప్రజలు, రాష్ట్రం కోసమే. నాకు కుల, మత విభేదాలు లేవు. తెలుగు జాతి అభ్యున్నతి నాకు ముఖ్యం. బడుగు, బలహీన వర్గాలను పైకి తీసుకొచ్చి అవకాశాలు కల్పిస్తాం. నేను ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. మన దూరదృష్టి కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. గుజరాత్ రాష్ట్రంలో 25 ఏళ్లుగా ఒకే పార్టీ అధికారంలో ఉంది. మోదీ 3వ సారి ప్రధాని అయ్యారు. మరోసారి అవుతారు. ప్రజలు ఏది మంచి, ఏది చెడు అనేది ఆలోచన చేసి...కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమర్థులను గెలిపించాలి" అని ముఖ్యమంత్రి కోరారు.

యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. అవినీతికి తావు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం. కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేశాం. వరద నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచుతాం. గోదావరి నుంచి 6000 టీఎంసీలు, కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లింది. వెలిగొండ ప్రాజెక్టుకు కావాల్సింది కేవలం 53 టీఎంసీల నీరే. ఈ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో సురక్షిత నీరు సరఫరా చేస్తాం. పరిశుభ్రమైన రాష్ట్రం కోసం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నాం. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 కార్యక్రమం చేపట్టాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి తెలిపారు.

ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు.

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు కు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "1996, మార్చి 5న ఈ ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్ళారా చూశాను. శ్రీశైలం నుంచి నీరివ్వమని ఇక్కడి ప్రజలు నన్ను కోరారు. ఆనాడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. భగవంతుడు మళ్లీ నాకే అవకాశం ఇచ్చాడు. వెలిగొండను పూర్తి చేసి మీ జీవితాల్లో వెలుగులు తెస్తాను. రైతులను ఆదుకుంటాం. 2014-2019లో ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించాం. ఈ ప్రాజెక్టు ద్వారా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యం. దీని వల్ల గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలకే కాకుండా ఉదయగిరి, కడప జిల్లా బద్వేలుకు కూడా నీరు అందుతుంది. 2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీరిచ్చేవాళ్లం. 2019-2024 మధ్య చీకటి రోజులు వచ్చాయి. గత ముఖ్యమంత్రి వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ దొంగ నాటకాలు ఆడాడు. చీమకుర్తి, మార్కాపురం సభల్లో 2023లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కటింగ్ చేశాడు. ఇలా చేయడం మోసం కాదా. నేను చేయగలిగిందే చెబుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి రూ.9081 కోట్ల నిధులు కావాలి. ఇప్పటి వరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు చేశాం. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం. ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపట్టాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని రైతులకు పంగ నామాలు పెట్టారు. మంచి చేసిన వారికి అండగా నిలిస్తేనే ప్రజల జీవితాలు మెరుగు అవుతాయి" అని ముఖ్యమంత్రి అన్నారు. "అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. ఎక్కడ పేదలు ఉంటే అక్కడ నేను ఉంటాను. ఎన్నికల్లో చెప్పినట్టే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్ల కోసం ప్రతి ఏటా రూ.34 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు రావాలని డ్వాక్రా సంఘాలు స్థాపించాను. ఈ ఏడాది లక్షమంది ఆడబిడ్డలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో రూ. 20,000 ఇస్తున్నాం. 2027లో పుష్కరాలకు ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. నల్లమల సాగర్ కు గోదావరి నీళ్లు ఇస్తాం. అది వచ్చేలోగా ఈ ఏడాది జులై నాటికి నల్లమల సాగర్ పూర్తి చేసి వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టు కోసం ఇంకా రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గతేడాది హంద్రినీవాపై శ్రద్ధ పెట్టాం. ఈ ఏడాది వెలిగొండ పై శ్రద్ధ పెట్టి ప్రజల జీవితాల్లో జలకళ తీసుకొస్తాం. హార్టికల్చర్ కు ఎక్కువ ప్రాధాన్య ఇస్తున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. సీమతో పాటు మార్కాపురం, ప్రకాశం జిల్లాలను ఉద్యాన పంటలతో అభివృద్ధి చేస్తాం. మార్కాపురాన్ని ఉద్యాన పంటలకు కేంద్రంగా తయారు చేసేందుకు ప్రజలు సహకరించాలి. రూ.1300 కోట్లు వ్యయంతో నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించే బాధ్యత తీసుకుంటాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే మార్కాపురాన్ని జిల్లాగా చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చాం. మార్కాపురం జిల్లాలో భూ రికార్డుల సమస్యలున్నాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏలో పెట్టారు. సర్వే రాళ్లపై వారి ఫోటోలు వేసుకున్నారు. మేము రాజముద్రతో పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ తో భూమి రికార్డులు భద్రంగా తయారు చేయిస్తున్నాం. ఎవరైనా తప్పు రికార్డులు చేస్తే తాట తీస్తామని హెచ్చరిస్తున్నాను. మార్కాపురం జిల్లా నూతన కలెక్టరేట్ భవనానికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నాం. 20 నెలల పాలనలో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి.

# త్వరలో గ్రామీణ ప్రాంత యూనిట్లు

మొదటి పేజి తరువాయి

పట్టణ ప్రాంత యూనిట్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు ఆర్థిక సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, కేంద్రం నుంచి పీఎంఏవై నిధులు అందలేదు. ఆ పథకం కింద నిధులు మంజూరు కావాలంటే, తమ విధివిధానాలను రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాలన్నది కేంద్రం నిబంధన. కాగా అందులో తేడా వస్తే నిధులు మంజూరు చేయటం లేదు. రాష్ట్రంలో ఇందిరమ్మ పథకం అమలుకు శ్రీకారం చుట్టినప్పుడు, ఇక్కడ అనుసరించిన పద్ధతులు కేంద్రం విధివిధానాలకు అనుకూలంగా లేవు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తొలి ఏడాది కేంద్రం నుంచి ఎలాంటి నిధులు రాలేదు. రెండో ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. కేంద్ర నిబంధనలకు అనుకూలంగా మార్పు చేర్పులు చేసుకుంది. దీంతో పీఎంఏవై పట్టణ ప్రాంత యూనిట్లు మంజూరయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం 2.7 లక్షల యూనిట్లు కావాలని గట్టిగా కోరినప్పటికీ, 1.13 లక్షల యూనిట్లనే కేంద్రం మంజూరు చేసింది. పట్టణ ప్రాంత ఇళ్లకు సంబంధించి యూనిట్ కాస్ట్ రూ.లక్షన్నర ఉండటంతో, ఆ యూనిట్లు ఎంత ఎక్కువ మంజూరైతే అంత ఎక్కువ సాయం అందుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పట్టణ ప్రాంత పరిధిని రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా చూపినా, కేంద్రం మాత్రం తక్కువే మంజూరు చేసింది.

త్వరలో గ్రామీణ ప్రాంత యూనిట్లు

ఇక వీలైనన్ని గ్రామీణ యూనిట్లు సాధించటంద్వారా ఎక్కు వ నిధులు పొందే యోచనలో భాగంగా 3 లక్షల యూనిట్లు మంజూరు చేయాలని రాష్ట్రం కోరింది. కాగా అర్బన్ యూని ట్లు అడిగినవన్ని ఇవ్వనందున, గ్రామీణ యూనిట్లు తెలంగాణ కోరినన్ని ఇచ్చే యోచనలో కేంద్రప్రభుత్వం ఉందని స మాచారం. మార్చి రెండో వారంలోగా గ్రామీణ ప్రాంతయూ నిట్లను మంజూరు చేస్తారని రాష్ట్రప్రభుత్వం ఆశిస్తోంది. మంజూరైతే ఒక్కో యూనిట్‌కు రూ.72 వేలు అందుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ యూనిట్ కాస్ట్‌ను రూ.5 లక్షలుగా అమలు చేస్తున్నందున, అందులో రూ.72 వేలు కేంద్రం భరిస్తే అంతమేర రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభిస్తుంది.

## న్యాయవ్యవస్థపై ఎన్‌సీఈఆర్‌టీ 'కుట్ర'..
# సుప్రీంకోర్టు సంచలన తీర్పు!

ఢిల్లీ: న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను మంటగలిపేలా పాఠ్యపుస్తకాల్లో అభ్యంతరకర అంశాలను ప్రచురించిన ఎన్‌సీఈఆర్‌టీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో న్యాయవ్యవస్థలోని అవినీతిపై చేర్చిన అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. ఆ పుస్తకంపై తక్షణ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది కేవలం పొరపాటు కాదు న్యాయవ్యవస్థను కించపరిచేలా చేసిన ఉద్దేశపూర్వక కుట్ర అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

బుల్లెట్ తగిలి రక్తం చిందిస్తోంది: సీజేఐ

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. "ఎన్‌సీఈఆర్‌టీ ప్రయోగించిన బుల్లెట్ తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. కోర్టుల విశిష్ట చరిత్రను వివరించాల్సింది పోయి వ్యవస్థను అణచివేసేలా పాఠాలు రాయడం సరికాదు" అని మండిపడ్డారు. యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పట్ల అగౌరవం కలిగించేలా ఈ పాఠ్యాంశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులెవరో తేలేవరకు ఈ విషయాన్ని వదిలిపెట్టబోమని, జవాబుదారీతనం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

కేంద్రం బేషరుతు క్షమాపణ

కోర్టు ఆగ్రహాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరుతుగా క్షమాపణలు కోరారు. ఈ పాఠ్యాంశాన్ని ప్రభుత్వం ఏమాత్రం సమర్థించడం లేదని, పబ్లిక్ నోటీసు ద్వారా క్షమాపణలు చెబుతామని వెల్లడించారు. ఇప్పటికే వివాదాస్పద పుస్తకాల పంపిణీని నిలిపివేసి, వెబ్‌సైట్ నుంచి కూడా ఆ పాఠాలను తొలగించామని కోర్టుకు వివరించారు.

కఠిన చర్యలకు ఆదేశం

ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు ఈ వివాదాన్ని కోర్టు దృష్టికి తీసుకురావడంతో సుప్రీంకోర్టు దీనిని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. ఈ కేసులో తదుపరి పరిణామాలు మార్చి 11న జరిగే విచారణలో వెల్లడికానున్నాయి.

# ప్రధాని మోదీకి అరుదైన గౌరవం..

అతి కొద్దిమంది ప్రపంచ నాయకుల జాబితాలో ఆయన చేరారు. పశ్చిమాసియా విషయంలో భారత్ అనుసరిస్తున్న సమతుల్య, సూత్రబద్ధమైన దౌత్యనీతికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీకి ఆ దేశ పార్లమెంట్ 'నెస్సెట్' బుధవారం అత్యున్నత పురస్కారమైన 'స్పీకర్ ఆఫ్ ద నెస్సెట్ మెడల్'ను ప్రదానం చేసింది. జెరూసలంలో నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా చేతుల మీదుగా మోదీ ఈ పతకాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్న తొలి వ్యక్తిగా మోదీ నిలవడం విశేషం. రక్షణ, సాంకేతికత, వ్యవసాయం, ఆవిష్కరణల వంటి కీలక రంగాల్లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో మోదీ చూపిన అసాధారణ నాయకత్వానికి గుర్తింపుగా ఈ అవార్డును అందించినట్లు నెస్సెట్ పేర్కొంది. కాగా, ప్రధాని మోదీ 2018లో పాలస్తీనా అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తీనా'ను అందుకున్నారు. ఒకవైపు ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకుంటూనే, మరోవైపు పాలస్తీనాకు మానవతా సాయం కొనసాగించడం ద్వారా భారత్ తన ప్రత్యేక దౌత్య వైఖరిని ప్రదర్శిస్తోందని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ఈ పురస్కారంపై ప్రధాని మోదీ స్పందిస్తూ, అత్యంత వినయంతో దీనిని స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ గౌరవం ఒక వ్యక్తికి దక్కింది కాదని, భారత్-ఇజ్రాయెల్ మధ్య ఉన్న స్నేహానికి ప్రతీక అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. తీవ్రమైన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్న ప్రాంతంలో రెండు వైరి వర్గాల నుంచి అత్యున్నత గౌరవాలు పొందడం ద్వారా మోదీ ఒక వారధిగా నిలిచారని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వయనాడ్‌లో 100 ఇళ్లు...
## 40 మంది దుకాణదారులకు
## రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం

మొదటి పేజి తరువాయి

వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కలిసి బాధితుల కోసం నిర్మించనున్న 100 ఇళ్ల నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. చురల్మల-ముండక్కాయ్ విపత్తు బాధితులకు ఈ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఈ విపత్తు వయనాడ్ ప్రజల ధైర్యాన్ని, మానవత్వాన్ని ప్రపంచానికి చూపిందన్నారు. "మీరు చాలా కోల్పోయారు, కానీ మీ ధైర్యాన్ని, మానవత్వాన్ని కోల్పోలేదు" అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన తన సోదరి ప్రియాంకతో ప్రయాణంలో జరిగిన ఓ సరదా సంఘటనను పంచుకున్నారు. "నేను మా సోదరితో సరదాగా ఏదో అన్నాను. అప్పటి నుంచి ఆమె నాతో మాట్లాడటం లేదు. ఇక్కడికి ఫ్లైట్‌లో వచ్చేంత వరకు ముభావంగానే ఉంది. కానీ వయనాడ్‌లో అడుగుపెట్టగానే ఆమె మారిపోయింది. మాకు వయనాడ్ అంటే అదే!" అని చెప్పడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ ప్రాంతంతో తమకు రాజకీయాలకు అతీతమైన బంధం ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... జూలై 30న విపత్తు జరిగిన వెంటనే తాను ఈ ప్రాంతానికి వచ్చినప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు నేను చూసిన దృశ్యాలు నా జీవితంలో మర్చిపోలేను" అని అన్నారు. ఇళ్లు, జీవనోపాధి, వ్యాపారాలు కోల్పోయిన కుటుంబాల పరిస్థితి తనను కలచివేసిందని చెప్పారు. అప్పటికి, ఇప్పటికి తాను మీ కుటుంబంలో ఒకరిగా మారిపోయానని భావోద్వేగంగా అన్నారు. ఈ సమస్యను పార్లమెంటులో ప్రస్తావించామని, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరామని ప్రియాంక తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి నిలిచారని ప్రశంసించారు. ఈ ప్రాజెక్టు కింద ప్రతి కుటుంబానికి 8 సెంట్ల స్థలంలో 1,100 చదరపు అడుగుల ఇల్లు నిర్మించి ఇవ్వనున్నారు. అలాగే, నష్టపోయిన 40 మంది దుకాణదారులు తమ వ్యాపారాలను తిరిగి ప్రారంభించుకోవడానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు.

## వారం రోజుల్లో కొత్త పార్టీ
# పేరు ప్రకటిస్తాం

మొదటి పేజి తరువాయి

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో తమిళనాడు రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన ఆమె, పార్టీ ప్రారంభానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. "వారం రోజుల్లో పార్టీ పేరు ప్రకటిస్తాం. పొత్తుల కోసం కూడా చర్చలు జరుపుతున్నాం. ఈ చర్చలు కచ్చితంగా ఒక మంచి నిర్ణయానికి దారితీస్తాయి" అని శశికళ పేర్కొన్నారు. అయితే, ఏ పార్టీలతో చర్చలు జరుపుతున్నారనే వివరాలను వెల్లడించడానికి ఆమె నిరాకరించారు. ఈ వ్యాఖ్యలతో తమిళనాట రాజకీయ ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో కొత్త పార్టీ నిర్మాణం సవాలుగా మారదా? అని విలేకరులు ప్రశ్నించగా శశికళ ధీమా వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రస్థానం, ప్రజా జీవితం గురించి తమిళనాడు ప్రజలకు బాగా తెలుసని, కాబట్టి పార్టీకి ప్రజల మద్దతు కూడగట్టడం పెద్ద కష్టమేమీ కాదని ఆమె అభిప్రాయపడ్డారు. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శశికళ ప్రకటనను రాజకీయ విశ్లేషకులు ఒక ముఖ్యమైన పరిణామంగా చూస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసిన తరుణంలో శశికళ రాకతో కొత్త రాజకీయ సమీకరణాలు, పొత్తుల వ్యూహాలు తెరపైకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సందర్భంగా నిన్న కన్నుమూసిన సీపీఐ సీనియర్ నేత ఆర్. నల్లకన్నుకు శశికళ నివాళులర్పించారు. ఆయన పేదల సంక్షేమానికే తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడని ఆమె కొనియాడారు. ఎంపీగా గానీ, ఎమ్మెల్యేగా గానీ ఏ పదవి చేపట్టకపోయినా, తన సిద్ధాంతాలకు కట్టుబడి చివరి వరకు నిలిచారని గుర్తు చేసుకున్నారు. "ఆయన అందరితో ఆప్యాయంగా ఉండేవారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు, ఆయన ఉద్యమానికి తీరని లోటు" అని శశికళ విచారం వ్యక్తం చేశారు. తాజా ప్రకటనతో రాబోయే నెలల్లో తమిళనాట రాజకీయ కార్యకలాపాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయని స్పష్టమవుతోంది.

## కేటీఆర్, హరీశ్‌రావువి అన్నీ అబద్ధాలే
## కాళేశ్వరం వైఫల్యాలపై మంత్రి పొంగులేటి

హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. ప్రాజెక్టులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవ దూరమని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి లక్ష్యమని ఆయన ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 1.08 లక్షల కోట్ల అంచనాతో నిర్మించి, కేవలం 110 టీఎంసీల నీటిని మాత్రమే అందుబాటులోకి తీసుకురావడం గత పాలకుల అసమర్థతకు నిదర్శనమని పొంగులేటి మండిపడ్డారు. ఎన్నికలకు ముందే బ్యారేజీలు కుంగిపోయాయని అన్నారు. ఆ తప్పిదాల నుంచి తప్పుకోవడానికే ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే బీఆర్ఎస్, బీజేపీల మధ్య 'ఫెవికాల్ బంధం' ఉందన్న విషయం బహిరంగ రహస్యమేనని, అందుకే వారు ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇవ్వాల్సింది పోయి, కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం దురదృష్టకరమని పొంగులేటి అన్నారు. తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడుతుందని, గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది రైతులకు మేలు చేకూర్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు.

## ఇంటర్ సెకండ్ ఇయర్ ఇంగ్లీష్ పరీక్షకు
# 43 మంది గైర్హాజర్



(నేటి శుభోదయ ):నూజివీడు పట్టణంలో ఇంటర్మీడియట్ సెకండియర్ ఇంగ్లీష్ పరీక్షకు గురువారం 43 మంది గైర్హాజర్ అయినట్లు కస్టోడియన్స్ ఎం స్వర్ణలత, బి శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో శ్రీ మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మరో ఐదు కళాశాలలో పరీక్ష నిర్వహించగా 1588 మంది విద్యార్థులకు గాను 1545 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. శ్రీ మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 260 మంది విద్యార్థులకు గాను ఏడుగురు విద్యార్థులు గైరహాజరు కాగా 253 మంది విద్యార్థులు పరీక్ష వ్రాసినట్లు చెప్పారు. శ్రీ వాగ్దేవి జూనియర్ కాలేజీలో 260 మంది విద్యార్థులకు ఇద్దరు విద్యార్థులు గైరహాజర్ కాగా 258 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. సెంట్ ఆన్స్ జూనియర్ కాలేజ్ లో 259 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజర్ కావడంతో 253 మంది విద్యార్థులు పరీక్ష వ్రాశారన్నారు. శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 275 మంది విద్యార్థులకు గాను 9 మంది విద్యార్థులు గైర్హాజరు కావడంతో 266 మంది విద్యార్థులు పరీక్ష వ్రాసినట్లు చెప్పారు. శ్రీ శారద జూనియర్ కాలేజ్ లో 315 మంది విద్యార్థులలో 9 మంది గైర్హాజర్ కావడంతో 306 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాశారన్నారు. బాలయోగి గురుకులంలో 219 మంది విద్యార్థులకు పదిమంది విద్యార్థులు గైర్హాజర్ కావడంతో 209 మంది పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. విద్యార్థుల కోసం పరీక్ష హాల్స్ వద్ద తాగునీరు, ఫ్యాన్లు లైట్లు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. అవసరం మేరకు మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పూర్తిగా సిసి ఫుటేజ్ ల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయని, సీసీ కెమెరాలు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ వారి కి అనుసంధానం అయినట్లు చెప్పారు. ఏ విధమైన మాస్ కాపీయంగుకు అవకాశాలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చెలరేకకుండా ముందుస్తూ చర్యలలో భాగంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు జరుగుతున్నట్లు తెలిపారు. 100 మీటర్ల లోపు జిరాక్స్ కాపీయింగ్ షాపులకు ఏమాత్రం అనుమతి లేదన్నారు. నిమిషం నిబంధన అధికారుల సూచనల మేరకు అమలు చేస్తున్నట్లు వివరించారు.

## గ్రామీణ వైద్యులను ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో విలీనం చేయడానికి తొండెపు దశరధ జనార్ధన్ ద్వారా సాధ్యమైంది.

-, రాష్ట్ర అధ్యక్షులు నందూరి ఉమాశంకర్



గుడివాడ, ఫిబ్రవరి 26 (అజయ్ నారగని- నేటి శుభోదయ ): ఆర్ఎంపీ, పి.ఎం.పి గ్రామీణ వైద్యులను ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో విలీనం చేయడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒక అధ్యయన కమిటీని ఏర్పాటు చేయడంలో ఆర్ఎంపీ, పి ఎం పి జాయింట్ యాక్షన్ కమిటీ ఏపీఆర్జేఏసీ జాక్ గౌరవాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు తొండెపు దశరథ జనార్ధన్ ద్వారా సాధ్యమైందని రూరల్ వైద్యుల సంక్షేమ సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నందూరి ఉమాశంకర్ పేర్కొన్నారు. గుడివాడ పుల్లలపాడు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడు దశాబ్దాలుగా చట్టబద్ధత కోసం ఎదురుచూస్తున్న గ్రామీణ వైద్యులకు ఇదొక సువర్ణ అవకాశం అని అన్నారు. తమ ఫెడరేషన్ అయిన ప్రాథమిక వైద్య సంఘాల సమాఖ్య తో పాటుగా మరో రెండు ఫెడరేషన్లు మూడు కలిపి జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటు చేసుకున్నామన్నారు. అందులో గౌరవ సలహాదారుగా డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, గౌరవ న్యాయ సలహాదారుగా డాక్టర్ నర్రా లోకనాథరావు, రాజకీయ సలహాదారుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి లంకదాసరి ప్రసాదరావులు జేఏసీలో ఉన్నారని చెప్పారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కృష్ణా జిల్లా అధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని జారవిడుచుకో రాదన్నారు. అందుకు సంఘాల నియమ నిబంధనలను పాటిస్తూ అధిక వైద్యం చేయకుండా ప్రాథమిక వైద్యం మాత్రమే చేసుకుంటూ అధ్యయన కమిటీ మన్ననలు పొందాలి అన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలా సింహాచలం, వర్కింగ్ ప్రెసిడెంట్ గుదే నాగ చంద్రశేఖర్ (నాని) , జిల్లా కోశాధికారి మేదూరి రమేష్ బాబు, ఏరియా అధ్యక్ష, కోశాధికారులు పంగా ఎర్రన్నాయుడు, చీకుర్తి ప్రదీప్, కమిటీ సభ్యులు మూల తదితరులు పాల్గొన్నారు.

## మే 3న జరగనున్న నీట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

---కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ



మచిలీపట్నం ఫిబ్రవరి 26 ( అజయ్ నారగని - నేటి శుభోదయ ) :మే నెల 3 వ తేదీన జరగనున్న నీట్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉన్నతాధికారులకు తెలిపారు. గురువారం మధ్యాహ్నం న్యూఢిల్లీ నుండి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ రాజేష్ లఖన్ నీట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ కళాశాల విద్య కమిషనర్ భరత్ గుప్తా తో కలిసి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో రెండు కేంద్రాలలో నీట్ పరీక్షలు నిర్వహించనున్నామని అందులో కేంద్రీయ విద్యాలయం, కృష్ణ విశ్వవిద్యాలయం ఉన్నాయన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేస్తున్నామన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా నుంచి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్, నీట్ పరీక్షల నిర్వహణ సమన్వయకర్త మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్, పరీక్ష కేంద్రం పర్యవేక్షకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

## పన్నులు చెల్లించని షాప్ల యాజమానులపై
# మున్సిపాలిటీ చర్యలు

-మునిసిపల్ కమీషనర్ ఎస్. మనోహర్



గుడివాడ, ఫిబ్రవరి 26 (అజయ్ నారగని - నేటి శుభోదయ) :గుడివాడ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్. పి. ఎస్. నార్త్ 1వ బ్లాక్,ఎస్. పి. ఎస్.వెస్ట్ 2వ బ్లాక్‌లకు సంబంధించిన షాప్ రూమ్స్‌లో అద్దె లేక లైసెన్స్ ఫీజులు అధికంగా పెండింగ్‌లో ఉండటంతో గురువారం అధికారులు చర్యలు చేపట్టారు. పన్నులు చెల్లించని కొంతమంది షాపులపై తాళాలు వేయడం జరిగింది. మొత్తం బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగతా పెండింగ్‌లో ఉన్న షాప్ యజమానులు వెంటనే తమ బకాయిలను పూర్తిగా చెల్లించాలి. లేకపోతే మిగిలిన షాపులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆదాయాన్ని పరిరక్షించడం మరియు ప్రజా సేవల నిర్వహణ కోసం పన్నుల వసూళ్లు అత్యంత ముఖ్యమని తెలిపారు. అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బకాయిలు చెల్లించి అనవసర సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు.

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

### లయన్స్ క్లబ్ అఫ్ విస్సన్నపేట ప్రెసిడెంట్ లయన్ రాయల అరుణ కుమారి





విస్సన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్) : లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ లయన్ రాయల అరుణ కుమారి అధ్యక్షతన నిర్వహించబడిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని లయన్ జిల్లా అంబిసిడర్ డాక్టర్ యన్ టి వెంకటేశ్వరరావు ప్రారంభించారు ఉచ్చిత కుట్టుమిషన్ కేంద్రం నందు 43 మంది మహిళలు ఈ కేంద్రంలో నేర్చుకోవడానికి నమోదు చేసుకున్న వారికి లయన్ బ్రహ్మచారి సహకారంతో అవసరమైన ఉపకరణములను పంపిణీ చేశారు ఈ కార్యక్రమం నందు లయన్ మిత్రులు సీజెడబ్ల్యూకె జాన్ బాబు(డిస్టిక్ గెస్ట్), సెక్రటరీ జగన్మోహన్ రెడ్డి,ట్రెజరర్ రవి మోహన్,లయన్ సభ్యులు లలితా రామకృష్ణ(లలితా సూపర్ మార్కెట్ వన్ ఆఫ్ ది డైరెక్టర్) డాక్టర్ కిరణ్ వీర్ల,డాక్టర్ శ్రీనివాసరావు,టి.వెంకట రెడ్డి,సూరి రాజు మొదలగు పలువురు లయన్ మిత్రులు పాల్గొనడం జరిగింది.

## నేటికి ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకున్న
# మాతృశ్రీ నూకాలమ్మ ఆలయం



గోకవరం-నేటిసుబోదయ.:గోకవరం మండలం కృష్ణుని పాలెం గ్రామపంచాయతీ రామన్నపాలెం గ్రామంలో గోకవరం నుండి రంప చోడవరం వెళ్ళే రోడ్డుకి ఆనుకొని ఉన్న మాతృ శ్రీ నూకాలమ్మ తల్లి అమ్మవారిని మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గూండా శివప్రసాద్ దంపతులుచే ప్రతిష్ట చేసి నేటికి ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకున్నదనీ తెలిపారు.తమ ఇంటిఆడపడుచు,తమ ఇలవేల్పు అయిన అమ్మవారి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించుచున్నట్లు శివప్రసాద్ దంపతులు తెలిపారు. భక్తి శ్రద్ధలతో జరుపుతున్న ఈ వేడుకలకు,భక్తులందరూ పిల్లాపాపలతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదములు స్వీకరించి,అమ్మవారి ఆశీస్సులు పొందాలని శివప్రసాద్ దంపతులు కోరారు.

## శ్రీ వాహిని ఇంజనీరింగ్ కళాశాలలో
# మెగా రక్తదాన శిబిరం

సౌజన్యం అందించిన వారు ఎన్ఎస్ఎస్ మరియు విజయ శ్రీ బ్లడ్ బ్యాంక్




విస్సన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్) :తిరువూరు నియోజకవర్గంలోని శ్రీ వాహిని ఇంజనీరింగ్ కళాశాల నందు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విజయవాడ వారి విజయ శ్రీ బ్లడ్ బ్యాంక్ సమన్వయంతో మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వాహిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు ప్రారంభించి తాను మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ప్రాణదానం చేయవచ్చని పేర్కొన్నారు విద్యార్థులు సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ కె.కె.వి.ప్రసాద్ మరియు ఎన్ఎస్ఎస్ స్టూడెంట్ కోఆర్డినేటర్లు విద్యార్థులను చైతన్యపరిచి భారీగా పాల్గొనేలా ప్రోత్సహించారు ఈ శిబిరంలో మొత్తం 80 మంది విద్యార్థులు రక్తదానం చేసి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారుకళాశాల చైర్మన్ శ్రీ పసుమర్తి వెంకటేశ్వరరావు,సెక్రటరీ శ్రీ ఊటుకూరి సుబ్రహ్మణ్యం,కరస్పాండెంట్ శ్రీ పొట్రు నాగేశ్వరరావు మరియు ట్రెజరర్ శ్రీ ముత్యాల కిషోర్ బాబు కార్యక్రమంలో పాల్గొని రక్తదాతలను అభినందించారు.

## స్వర్ణాంధ్ర 2047 ఫిబ్రవరి 2026 మాసపత్రిక ఆవిష్కరించిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్



ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట, ఫిబ్రవరి 26 ( బేతురంగా, నేటి శుభోదయం) :జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించిన స్వర్ణాంధ్ర 2047 మాసపత్రికను శాసనసభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తమ నివాసంలో ఘనంగా ఆవిష్కరించారు.బిఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర 2047 విజన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే దిశగా రూపొందించబడిందని పేర్కొన్నారు. విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, సాంకేతికత వంటి కీలక రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని అన్నారు.జగ్గయ్యపేట నియోజకవర్గం అభివృద్ధి కూడా ఈ విజన్‌లో కీలక భాగమని, నియోజకవర్గ ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మాసపత్రిక ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు, ప్రజలకు చేరువయ్యే సమాచారాన్ని సులభంగా అందించవచ్చని పేర్కొన్నారు.

## జావెలిన్ త్రో మరియు షాట్‌పుట్ పోటీల్లో తొలి స్థానం సాధించిన ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్



ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట ఫిబ్రవరి 26 ( బేతురంగా, నేటి శుభోదయం) విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా నిర్వహించిన ఆంధ్రా అసెంబ్లీ క్రీడా మహోత్సవాలలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన జావెలిన్ త్రో మరియు షాట్‌పుట్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి తొలి స్థానం సాధించి విజేతగా నిలిచారు.క్రీడల పట్ల తన ఆసక్తి, క్రమశిక్షణ, పట్టుదలతో యువతకు ఆదర్శంగా నిలిచిన ఎమ్మెల్యే గారిని క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

## విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే
# తమ ప్రధాన కర్తవ్యం



గోకవరం-నేటినుబోదయం. :విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే ప్రధాన కర్తవ్యమనిగుమ్మలదొడ్డి ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సునీల్ కుమార్ అన్నారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలలోని ప్రతిభను విద్యార్థులు తల్లిదండ్రులు చూసి గర్వపడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేకసదుపాయాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ఈ విషయాన్ని గమనించి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ కాన్వెంట్లోకి పంపించకుండా గవర్నమెంట్ పాఠశాలలోనే చేర్పించాలని తెలిపారు. ఎస్ఎంసి చైర్మన్ నాగ గన్నిబాబు మాట్లాడుతూ పాఠశాల ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఉపాధ్యాయుడు ఎంతో ప్రయత్నిస్తున్నారన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి తగిన శిక్షణ ఇచ్చేందుకు ఇక్కడ ఉపాధ్యాయులు ఎంతోకష్టపడుతున్నారన్నారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గుమ్మల దొడ్డి ఎంపీపీ పాఠశాల ఈ మండలంలోనే అనేక పాఠశాలకు ఆదర్శవంతంగా నిలుస్తుందని ,ఇక్కడ ఉపాధ్యాయులు ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని విద్యతోపాటు కరుక్యులర్ యాక్టివిటీస్ నేర్పిస్తూ వారిని ఉత్సాహంగా ఉంచుతూ విద్యను అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను అలరించాయి. చిన్నారులు చేసిన స్వాగత గీతం, జానపద నృత్యాలు, అమ్మ మీద పాడిన పాటలు అక్షరాల పాటలు, ఇంగ్లీషు రైమ్స్ తెలుగు రైమ్స్, చిన్న చిన్న కిట్స్ ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# 5.30 కాసులు బంగారాన్ని డిసీకి అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది



గోకవరం-నేటిసుబోదయ. :మండల కేంద్రమైన గోకవరం ఆర్టీసీ డిపో నుండి రంపచోడవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో గురువారం ఓ ప్రయాణికురాలు హ్యాండ్ బాగ్ మర్చిపోవడంతో బస్సు డిపోకు చేరుకోగా బస్సు డ్రైవర్, కండక్టర్ ఏపీ శర్మ, కే శేషగిరిలు బ్యాగును గమనించి డిసి సెక్యూరిటీ సమక్షంలో పరిశీలించగా ఆ బ్యాగ్ లో 47 గ్రాముల బంగారం హారం,3 గ్రాములు చెంప సగరాలు, 420 నగదు, ఆధార్ కార్డు ఉన్నట్లు గమనించారు. ఆధార్ కార్డు ఆధారంగా ఆ వ్యక్తి మడకం అమ్మాజీ గా గుర్తించి అమ్మాజీని పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని లెటర్ తీసుకొని సెక్యూరిటీ సమక్షంలో ఆ బంగారాన్ని అప్పగించడం జరిగింది అన్నారు.మానవత్వంతో అప్పగించిన ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## కోరుకొండ క్షేత్రంలో ఘనంగా పుట్ట మన్ను సేకరణ, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు...!!

- కళ్యాణానికి ముందు రోజు సాంప్రదాయబద్ధంగా వేదపండితుల ఆధ్వర్యంలో జరిగిన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణోత్సవానికి ముందు రోజు గురువారం వేదపండితుల ఆధ్వర్యంలో జరిగిన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు. స్వామి వారి ఉత్సవాల్లో గురువారం సాయంత్రం స్థానిక దేవుని కోనేరు వద్ద నుంచి పుట్టమన్ను సేకరించారు. అలాగే అంకురార్పణం, ధ్వజారోహణం కార్యక్రమాలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. దీంతో కోరుకొండ తీర్థం, స్వామివారి కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్పి రంగరాజు బట్టర్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు పెదపాటి, పెద్దింటి, పెరవలి, వంశీకుల ఆధ్వర్యంలో వైఖానస వేదపండితుల మంత్రోచ్ఛారణతో మంగళ వాయిద్యాలతో అంకురార్పణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, లక్ష్మీ నరసింహ స్వామి వారి మాల ధారణ భక్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## వైసీపీ నాయకుడు యారం ఇస్సాకు కు ఆర్థిక సహాయం ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



బాపట్ల నేటి శుభోదయ :ఫిబ్రవరి 26అనారోగ్యంతో చీరాల ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న కర్లపాలెం ఎంపీపీ యారం వనజ భర్త, సీనియర్ వైసీపీ నాయకుడు ఇస్సాకు కు మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆర్థిక సహాయం చేశారు. అతని అనారోగ్యం పై సమాచారం అందుకున్న వెంటనే ఫోన్ లో వారిని పరామర్శించి వెంటనే ఆర్థిక సహాయాన్ని వారికి అందజేసి ధైర్యంగా ఉండాలని చెప్పారు. అలాగే డాక్టర్ తో కూడా మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని ఆయన కోరారు.

## వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు నాటు సారాయి స్వాధీనం వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజు



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) :ఫిబ్రవరి 26 వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టువర్టుపురం గ్రామంలో ఈ రోజు ఎస్సై భాగ్యరాజు గారి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేయగా, మన్యం లక్ష్మీ అనే వ్యక్తి అక్రమంగా నాటు సారాయి తయారు చేసి విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడి నిర్వహించారు. తనిఖీలలో నాలుగు లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగింది. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా ఎస్సై భాగ్యరాజు ప్రజలకు తెలియజేస్తూ, ఎవరైనా నాటు సారాయి, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు లేదా దొంగ వస్తువులు కలిగి ఉండటం, కొనుగోలు చేయటం లేదా విక్రయించడం చేస్తే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ ప్రజలు అనుమానిత వ్యక్తుల గురించి సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## చందోలు గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్



ఫిబ్రవరి 26 : బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరావు ఆదేశాల మేరకు సర్కిల్ సీఐ హరికృష్ణ గారి ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని యానాది కాలనీ నందు గురువారం ఉదయం నాలుగు గంటల నుండి ఇళ్లల్లో తనిఖీ చేశారు ప్రతి ఇంట్లోని వాహనంతో పాటు ఆధార్ కార్డు తనిఖీ చేశారు అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరు వివరాలు సేకరించి వారి ఆధార కార్డులు ఆన్లైన్ లో సరిచూసుకున్నారు కార్డెన్ సెర్చ్ లో సరైన ఆధారాలు లేని 3 ద్విచక్ర వాహనాలు స్వాధీన పరుచుకొని పోలీస్ స్టేషన్ కు తరలించటమైనది. ఊరులో అనుమానాస్పదంగా ఎవరన్నా సంచరిస్తున్న పోలీస్ స్టేషన్ కి సమాచారం అంద చేయవలసిందిగా కోరారు.

## ఉద్యమి సభ్యత్వం నమోదు కార్యక్రమం నామన వెంకట శివన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించడం అయినది.





బాపట్ల నేటి శుభోదయఫిబ్రవరి 26 :బాపట్ల పట్టణం, చీలు రోడ్డు సెంటర్లోని బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయం నందు & కొత్త బస్టాండ్ వద్ద & పిట్లవాని పాలెం మండలం చందోలు & కర్లపాలెం మండలం లోను బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ గారి ఆధ్వర్యంలో ఈరోజు ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గంలోని సాదక్ (క్రియాశీలక వాలంటీర్లు), ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యులు బాపట్ల నియోజకవర్గ మండల అధ్యక్షులు జనసేన నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు

## పవన్ కళ్యాణ్ పిలుపుతో జోరందుకున్న జనసేన సభ్యత్వ నమోదు బాపట్లలో విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో ఘన నిర్వహణ



బాపట్ల నేటి శుభోదయఫిబ్రవరి 26 :బాపట్ల పట్టణంలోని పటేల్ నగర్లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అనుసంధానంగా ఈ కార్యక్రమాన్ని బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్ సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఇంటికి జనసేన సిద్ధాంతాలను తీసుకెళ్లడం మా లక్ష్యం. ఉద్యమి సభ్యత్వం అనేది కేవలం పార్టీ గుర్తు కాదు, అది ప్రతి కార్యకర్తకు ఒక రక్షణ కవచం. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు సభ్యత్వం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుంది. జనసేన పార్టీ తన కార్యకర్తల పట్ల ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని స్పష్టం చేశారు. బాపట్ల నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని ఆయన తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి, బాపట్ల తూర్పు సత్రం చైర్మన్ గుంటుపల్లి తులసి కుమారి మాట్లాడుతూ, గతంలో కన్నా ఈసారి సభ్యత్వ నమోదు మరింత విస్తృతంగా చేపడుతున్నాం. పవన్ కళ్యాణ్ పిలుపుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ వివరించి, జనసేన కుటుంబాన్ని మరింత బలపరచాలి అని ఆమె అన్నారు. ఉద్యమి సభ్యత్వం అనేది పార్టీ తరఫున ఇచ్చే ఒక పెద్ద భరోసా అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గొట్టుపాటి శ్రీకృష్ణ, దయాసింగ్, ఏసోబు, కారుమూరి ఆంజనేయ, కొక్కిరాల రాజేంద్ర, పసుపులేటి మహేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జనసేన పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించి పట్టణంలో తొలి సభ్యత్వం నమోదు చేసుకున్న - సామినేని ప్రసాద్ బాబు



ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట, ఫిబ్రవరి 26 (బేతురంగా, నేటి శుభోదయ) :జగయ్యపేట పట్టణంలో జనసేన పార్టీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైనది జనసేన పార్టీ బలోపేతమే ధ్యేయంగా, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాను ప్రకారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభానుతనయులు యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ జగ్గయ్యపేట పట్టణంలో స్థానిక బస్ స్టాండ్ సమీపంలో ప్రారంభించి తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం సామినేని ప్రసాద్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పల్లె, ప్రతి వార్డులో జనసేన సిద్ధాంతాలను నమ్మే సైనికులను ఏకం చేసే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది అని తెలియజేశారు2014లో కేవలం 150 మందితో మొదలై, నేడు 13 లక్షల మందికి పైగా సభ్యులతో బలమైన శక్తిగా ఎదిగిన జనసేన, మరింత ఉన్నత శిఖరాలకు చేరుతుందని ఆయన తెలియజేశారు. పార్టీ కోసం శ్రమించే కార్యకర్తల క్షేమమే ధ్యేయంగా, ప్రతి క్రియాశీలక సభ్యునికి రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని పార్టీ కల్పిస్తోంది అన్నారు. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని పార్టీ నిధి నుండే చెల్లిస్తారని తెలియజేసి ఇందుకోసం ఇప్పటికే తన వంతుగా రూ. 2 కోట్ల భారీ విరాళాన్ని పార్టీకి అందజేసిన జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారుఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు వీర మహిళలు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

### శతాబ్దాల చరిత్ర ప్రసిద్ధి చెందిన కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి రథోత్సవం,

# కల్యాణ ఉత్సవాలకు భారీ సన్నాహాలు..

- ఫిబ్రవరి 27 నుంచి మార్చి 4 వరకూ 'నరసన్న బ్రహ్మోత్సవాలు'

- 27న (నేడే) స్వామివారి రథోత్సవం, రాత్రి కల్యాణం..

- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విదేశాల నుంచి కూడా తరలిరానున్న స్వామి వారి భక్తులు, గ్రామస్తులు..!!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె); శతాబ్దాల చరిత్ర ప్రసిద్ధి చెందిన 'స్వయంభూ' కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాలకు భారీ సన్నాహాలు పూర్తి చేశారు. కోరిన కోరికలు తీర్చే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు పూర్తిగా వైఖానస ఆగమం ప్రకారం ఉత్సవాలు నిర్వహించబడతాయి. దత్తత దేవస్థానమైన అన్నవరం వీరవెంకటసత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉత్సవాలు 7 రోజుల పాటు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. 27న శుక్రవారం జరగాల్సిన రథోత్సవం నిమిత్తం రధానికి అన్ని మరమ్మతులు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణం నిమిత్తం మండపాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల సందర్భంగా స్థానిక శ్రీ విరియాల రెడ్డిపంతులు సత్రంలో భక్తులకు భోజనవసతి కల్పించనున్నారు. ఈ మేరకు సత్రం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మెట్లమార్గంతో స్వామివారి దర్శనానికి కొండెక్కే భక్తుల సౌకర్యార్థం 653 మెట్లకు రంగులు వేశారు. ఉత్సవాల్లో గురువారం మొదటి రోజున స్థానిక దేవుని కోనేరు వద్ద నుంచి పుట్ట చున్ను సేకరిస్తారు. అలాగే అంకురార్పణం, ధ్వజా రోహణం జరుగుతుంది. దీంతో తీర్థం ప్రారంభము వుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు రథోత్సవం, అదే రోజు రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణం ఆలయ ప్రధాన అర్చకులు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. వైఖానస వేదపండి తుల మంత్రోచ్ఛారణతో స్వామివారు పురవీధుల గుండా రథం మీద తిరుగుతూ భక్తులకు దర్శనమిస్తారు. రథోత్సవం అనంతరం లక్ష్మీదేవి. స్వామివారులకు మంగళస్నానాలు నిర్వహిస్తారు. కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు




పట్టువస్త్రాలతో అలంకరించిన పెండ్లి కుమార్తె, పెండ్లి కుమారుడిలా పీటలపై ఆశీనులవుతారు. స్వామివారి కల్యాణం వైఖానస ఆగమ, శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం జరుగుతుంది. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్పీ రంగరాజభట్టర్, వైఖానస పండితుడు పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో జరుగుతుంది. అర్చక స్వాములు పెదపాటి, పెద్దింట్, పెరవలి కుటుంబీ కుల స్వీయపర్యవేక్షణలో పాంచాహ్నిక దీక్షతో కల్యాణ వేడుకలు నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో జరిగే గ్రామోత్సవాల్లో స్వామివారు గరుడ, ఆంజనేరు, గజ, శేష వాహనాలపై గ్రామోత్సవం చేస్తారు. ఉత్సవాల్లో భాగంగా మార్చి 25 స్థానిక రంగనాథ స్వామి దేవాలయంలో స్వామి కల్యాణం వైభవంగా



జరుగుతుంది. మార్చి 4న స్వామివారి ఆలయంలో శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. స్వామి వారికి ద్వాదశ ప్రదక్షణలు, నివేదనలతో కూడిన కార్యక్రమం జరుగుతుంది. మార్చి 3న చంద్రగ్రహణం కారణంగా ఉదయం 6.30 గం టల నుంచి సాయంత్రం 6.29 గంటల వరకు గ్రహణ సర్వకాలం కావడంతో మోక్షకాలం సాయం త్రం 8.47 గంటలకు చక్రతీర్థం నిర్వహిస్తారు. ఉత్సవాలకు ముస్తాబైన స్వామి ఆలయం అనంతరం ఆలయం మూసివేయబడుతుంది. భక్త లకు అవసరమైన తాగునీరు, వైద్యశిబిరాలు,విద్యుత్, అంబులెన్సులు, అగ్నిమాపక జాగ్రత్తలు తీసుకున్నారు. దేవదాయశాఖకు చెందిన వందలాది మంది ఉద్యోగులు, సిబ్బందితో పాటు, అన్నవరం దేవస్థానం అధికారులు, సిబ్బంది విధులు నిర్వహి స్తారు. భక్తులకు సమస్యలు తలెత్తకుండా సెక్యూ రిటీని ఏర్పాటు చేశారు. అన్నవరం ఈవో వేంద్ర త్రినాథ్ ఉత్సవాలను పర్యవేక్షిస్తారు. అలాగే స్థానిక శ్రీ విరియాల రెడ్డి పంతులు సత్రంలో భక్తుల సౌకర్యార్థం భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాల ముగింపు వరకూ మధ్యాహ్నం, రాత్రివేళల్లో






భోజనాన్ని ఏర్పాటు చేయడం ఈ సత్రం ప్రత్యేకత. స్వామివారి తీర్థానికి వచ్చిన భక్తులకు భోజన, వసతి ఏర్పాట్లలో ఏ లోటు రాకుండా చూడాలని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సంబంధిత అధికారులకు సూచించారు.

# 'జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తత కలిగి ఉండాలి..'

- కల్తీ పాల, కలుషిత జలాల సమస్యపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష..

- జిల్లా యంత్రాంగానికి సీఎం స్పష్టమైన దిశా నిర్దేశం..




రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎస్పీ డి నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్ ఎం సి, పశు సంవర్ధక శాఖ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం అమరావతి నుంచి తూర్పు గోదావరి, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ప్రజా ప్రతినిధులతో కల్తీ పాలు, కలుషిత జలాల పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్షేత్ర స్థాయిలో ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించండం జరిగింది. జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తత కలిగి ఉండాలని పేర్కొన్నారు. సమస్యలను మూలం నుండే గుర్తించి, ఎటువంటి ఉదాసీనతకు తావు లేకుండా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అందుకు అనుసరించి క్రియాశీలంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. డేటా విశ్లేషణ కు సంబంధించిన సేకరించిన సమాచారం సరైన విధంగా విశ్లేషించి, సమస్య పరిష్కార మార్గాలను రూపొందించాలన్నారు. సిద్ధాంతాత్మకంగా కాకుండా ఆచరణ సాధ్యం అయ్యే విధంగా ఫలితాల మీద దృష్టి పెట్టాలన్నారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ప్రకారం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలనీ ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆడిట్ ఫలితాలు, ల్యాబ్ రిపోర్టులు క్షేత్ర స్థాయి పరిశీలనలతో సమ్మిళితం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే విధంగా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, ఆమేరకు స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండేలా, నిరంతర పర్యవేక్షణ చెయ్యడం ముఖ్యం అన్నారు. శనివారం మరో సారి సమీక్ష నిర్వహించండం జరుగుతుందనీ పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి జిల్లాలో కల్తీ పాల ఘటన వివరాలు తెలియ చేస్తూ, ఈ సమాచారం తెలిసిన వెంటనే తగిన చర్యలు చేపట్టడం ప్రారంభించామని తెలియ చేశారు. ఘటన జరిగిన నేపథ్యంలో స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో ఒకే కుటుంబానికి చెందిన వృద్ధులు నలుగురు ఫిబ్రవరి 22న అడ్మిషన్ అయ్యారని తెలిపారు. బాధితులు అనూరియా (మూత్ర విసర్జన లేకపోవడం), వాంతులు, కడుపు నొప్పి, డయాలసిస్ అవసరమయ్యే తీవ్రమైన మూత్రపిండ వైఫల్యంతో చౌడేశ్వర నగర్, స్వరూప నగర్, లాలా చెరువు ప్రాంతాల నుండి వివిధ ఆసుపత్రుల్లో చేరారనీ తెలిపారు. ప్రాథమిక క్లినికల్ ఫలితాల ఆధారంగా, విషపూరిత పాల కారణంగా కిడ్నీ పనితీరు తగ్గినట్లు, సీరం క్రియేటినిన్ స్థాయిలు పెరగడం వల్ల తీవ్రత ఎక్కువ ఉంటుందని వైద్యులు సూచనలు చేయడం జరిగిందనీ తెలిపారు. ఎపిడెమియోలాజీ పరిశీలనలో పాల వినియోగం, కేసుల మధ్య ప్రబలమైన సంబంధంగా ప్రాథమికంగా గుర్తించబడిందనీ, పరీక్షల వివరాలు వొచ్చిన తర్వాత వాస్తవ కారణాలు పై స్పష్టత వస్తుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు. పాల సరఫరా నియంత్రణలో 'వరలక్ష్మి మిల్క్ డైరీ' నరసాపురం గ్రామం కోరుకోండ మండలం ద్వారా సరఫరా నిలిపివేయడం జరిగిందన్నారు.

పాల కల్తీ కు సంబంధించి మొత్తం అడ్మిషన్లు 20 కాగా వారిలో 5 మరణాలు సంభవించాయనీ,15 మంది చికిత్స పొందుతున్నారని వెల్లడించారు.

ఈ ఘటన తర్వాత పరిష్కార చర్యలుగా వేగవంతం చేయడం జరిగిందనీ, క్షేత్ర స్థాయిలో 9 వైద్య బృందాలు 110 గృహాలను సందర్శించి 315 రక్త నమూనాలను సేకరించామన్నారు. మరింత విస్తృత స్థాయిలో జిల్లా లో వనరుబుల్ ప్రాంతాలపై ప్రత్యేక విజిలెన్స్ కమిషనర్ రాహుల్ మీనా ఆధ్వర్యంలో 14 సర్వైవల్ బృందాల ద్వారా 957 కుటుంబాలను ప్రతిరోజూ స్క్రీనింగ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 'ప్రజల ప్రాణాలను కాపాడడం, వెంటనే వైద్య చర్యలు చేపట్టడం, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలను నివారించడం ప్రధాన లక్ష్యం' గా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయడం జరుగుతుందని తెలియ చేశారు.

రాజమహేంద్రవరం అర్బన్ శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు.

కల్తీ పాలు ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే సదరు వెండర్ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించడం జరిగిందని ఎస్పీ డి. నరసింహ కిషోర్ తెలిపారు. వినియోగదారులు పాలు విషయంలో తేడా ఉన్న విషయం గుర్తించినట్టు తెలిపారు. ప్రస్తుతం వాస్తవ వివరాలు తెలుసుకునే దిశలో అవసరమైన అన్ని చర్యలు చేపట్టడం జరుగుతోందని వెల్లడించారు.



నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## పండుగ వాతావరణం లో ఘనంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం

-జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వం పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కార్యదర్శి కొదమల గంగాధరరావు



గుడివాడ, ఫిబ్రవరి 26 ( అజాయ్ నారగాని– నేటి శుభోదయ ): జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కార్యకర్తల కుటుంబాలు శ్రేయస్సు కోసం ప్రమాద పాలసీను సభ్యత్వం తో పాటు ఇవ్వటం జరుగుతుంది అని గుడివాడ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. జనసేన పార్టీ సానుభూతి పరులు, పవన్ కళ్యాణ్ అభిమానులు తప్పకుండ సభత్వం తీసుకుని పార్టీ ని బలపరచాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, రూరల్ మండలఅధ్యక్షులు, ఇంటూరి



గజేంద్ర, నందివాడ మండల అధ్యక్షులు, తారకరామారావు వడ్లమన్నాడు పి. ఎ. సి. ఎస్.అధ్యక్షులు అడపా బాబి,వలివర్తిపాడు అధ్యక్షులు పంచకర్ల బ్రహ్మయ్య, పట్టణ ఉపాధ్యక్షులు వేమూరి త్రినాథ్ పట్టణ ప్రధాన కార్యదర్శి, విఘ్నేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ సాయిన రాజేష్, బేతవోలు ఆనందేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బుడమా రాజు, జిల్లా నాయుకులు కొండపల్లి చంద్రశేఖర్ రెడ్డి, గునుకుల వినోద్, సాయికృష్ణా,కోసూరి ఆంజనేయులు,సుంకర వెంకట్,దుర్గారావు, జనపాల కిరణ్, షరీఫ్, షేక్ నాగుర్ బాషా,సాయిపవన్, వెంకటేష్,కొట్టె శివ,కందికొండ దుర్గా, ఏలూరి చంద్రశేఖర్, బోయిన చంటి, పరుచూరి రాజేష్, మండల నాయుకులు కాకి బాబ్జి, జబి ఖాన్, కటకం కొండా, సూరిశెట్టి రాజబాబు, శేషం కేశవ,పెంజేంద్ర రాము, కునా నాగరాజు, వీరామహిళలు కళ్యాణి,కనకదుర్గా,నాగరాణి, శిరీషా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల్య వివాహాలులేని సమాజానికి కృషి చేద్దాం

- సూపర్వైజర్ విజయలక్ష్మి



పులిచెర్ల, ఫిబ్రవరి 26,(నేటి శుభోదయ) :బాల్య వివాహాలు లేని సమాజానికి కృషి చేద్దామని పులిచెర్ల సిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ విజయలక్ష్మి అన్నారు.. చిత్తూరు జిల్లా. పులిచెర్ల మండలం. కావేటి గారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో. సిడిపిఓ వాణిశ్రీ దేవి ఆదేశాల మేరకు సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో 6. వ తరగతి నుంచి 10.వ. తరగతి బాలికలకు. బాల్య వివాహాలు వలన జరిగే. అనార్ధాలు. అనారోగ్యాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ. బాలికలు 18 సంవత్సరాలు బాలురు 21 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత వివాహాలు చేసుకోవాలని. అంతకుముందు చేసుకుంటే . చట్టరీత్య నేరమన్నారు . బాల్య వివాహాలు ఎక్కడైనా చేయిస్తే.1098. నెంబర్.కు. కాల్ చేస్తే వెంటనే అధికారులు స్పందిస్తారని. బాల్య వివాహాలు ఆపివేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. లోకనాథరెడ్డి.. ఉపాధ్యాయులు. జయచంద్ర నాయుడు.. విద్యాసాగర్.. శ్రీనివాసులు . మధుసూదన్ రెడ్డి... అష్రాఫ్ సాహెబ్.. అంగనవాడి కార్యకర్తలు.. ఉమారాణి. ప్రభావతి. విద్యార్థినిలు పాల్గొన్నారు

## అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

పులిచెర్ల, ఫిబ్రవరి 26,(నేటి శుభోదయ) :అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని అంగన్వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు సరస్వతి, ప్రేమలత, మోబిన్ తాజ్,





అలివేలు, గీత, సుజాత, శ్యామల అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా నాలుగవ రోజు గురువారం అంగన్వాడీలు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. తమ న్యాయమైన కోరికలు ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పులిచెర్ల, ఫిబ్రవరి 26,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం నన్నూరివారి పల్లి సర్పంచ్ వాసుదేవ రెడ్డి గురువారం నూతన గృహప్రవేశం చేశారు. ఈ నూతన



గృహప్రవేశ వేడుకలలో మాజీమంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని వాసుదేవ రెడ్డి దంపతులను, కుటుంబ సభ్యులను ఆప్యాయతగా పలకరించి వాసుదేవరెడ్డి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రీన్ అంబాసిడర్స్ కు పాద పూజ




విజయవాడ, ఫిబ్రవరి 26 (అజయ్ నారగాని– నేటి శుభోదయ) రాజధాని తుళ్లూరు సి ఆర్ డి ఏ కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్స్ కు కార్యాలయ సిబ్బందికి అమరావతి బ్రాండ్ అంబాసిడర్ తండ్రి




డాక్టర్ మనోజ్ పాదపూజ చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమరావతికి జీవం పోద్దాం 116 రూపాయలు సాయం చేద్దాం కార్యక్రమం నిర్వహించగా కార్యాలయ సిబ్బంది గ్రీన్ నెంబర్స్ దేస్ అమరావతి నిర్మాణంలో పాలు భాగస్తులగుటకై సి ఆర్ డి ఐ అకౌంట్ కు క్యూ ఆర్ కోడ్ ద్వారా స్వతహాగా నగదు బదిలీ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ బొర్ర శ్రీనివాసరావు మరియు గుడివాడకు చెందిన రెడ్డి బంగారయ్య, పలువురు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారి ఆదేశాలతో బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించిన పోలీస్ అధికారులు

### 40 ద్విచక్ర వాహనాలు, 4లీటర్ల నాటు సారా స్వాధీనం

### శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం కార్డెన్ అండ్ సెర్చ్


### బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్)ఫిబ్రవరి 26:శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించడం జరిగినదని జిల్లా ఎస్పీ శ్రీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారు తెలిపారు. ఎస్పీ గారి ఆదేశాల మేరకు, బాపట్ల ఇన్–చార్జ్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్ గారి పర్యవేక్షణలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం తెల్లవారుజాము నుండి ఉదయం 8 గంటల వరకు పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.బాపట్ల టౌన్ సీఐ ఆర్. రాంబాబు నేతృత్వంలో, ఎస్సైలు ఎం. విజయ్ కుమార్, షేక్ నస్రీన్ మరియు 20 మంది సిబ్బందితో కలిసి రాజీవ్ గాంధీ కాలనీలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహాత్మాజీపురం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంపై అనుమానంతో బాయ్స్ హాస్టల్‌లో సైతం తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.వేదుళ్లపల్లి ఎస్సై పి. భాగ్యరాజు స్టూవర్టుపురం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, ఒక మహిళ ఇంట్లో 4 లీటర్ల నాటు సారా లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.చందోలు ఎస్సై ఎం. వెంకట శివకుమార్ తన సిబ్బందితో కలిసి స్థానిక ఎస్టీ కాలనీలో తనిఖీలు చేసి, 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.కర్లపాలెం ఎస్సై ఎస్. రవీంద్ర, తన సిబ్బందితో కలిసి కొత్త బస్టాండ్ వెనుక ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి, 5 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.పర్చూరు ఎస్సై పి. గోపి ఇందిరా కాలనీలో తనిఖీలు నిర్వహించి, 12 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. గతంలో ఎన్‌డీపీఎస్ (చీణూా) కేసుల్లో నిందితుల గృహాలను తనిఖీ చేశారు.యద్దనపూడి ఎస్సై డి. రత్నకుమారి, స్టేషన్ సిబ్బంది అనంతవరం ఎస్టీ కాలనీలో తనిఖీలు చేపట్టి, 7 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గంజాయి వంటి మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరిణామాలు గురించి ప్రజలకు వివరించారు. వాహనదారులు ప్రతి ఒక్కరు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ గారి ఆదేశాలతో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే ముఖ్య ఉద్దేశంతో ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీలలో బాపట్ల టౌన్‌లో 10, రూరల్‌లో 3, చందోలులో 3, కర్లపాలెంలో 5, పర్చూరులో 12, యద్దనపూడిలో 7, మొత్తం 40 ద్విచక్ర వాహనాలను సరైన పత్రాలు లేనందున సీజ్ చేయడం జరిగిందన్నారు. వేదుళ్లపల్లి పరిధిలోని స్టూవర్టుపురంలో జరిపిన సోదాల్లో ఒక మహిళ ఇంటి వద్ద 4 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు ఇటువంటి తనిఖీలు నిరంతరం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో లేదా పట్టణాల్లో కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నేరగాళ్లకు ఆశ్రయం కల్పించడం కూడా నేరమేనన్నారు. ప్రతి వాహనదారుడు తమ వాహనానికి సంబంధించిన సరైన ధృవపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, లేని పక్షంలో అనుమానాస్పద వాహనంగా భావించి సీజ్ చెయ్యడం జరుగుతుందని హెచ్చరించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు, వ్యసనాలకు దూరంగా ఉండి తమ లక్ష్య సాధనకు కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసితే వెంటనే స్థానిక పోలీసులకు (లేదా) టోల్ ఫ్రీ నెంబర్ 112కు కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజల రక్షణ కోసమే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు.

# సాహసోపేతమేగానీ...



సహనం, ఓర్పు, సంయమనం, ప్రయామం, నిగ్రహం... ఎదుటివారు ఎంతగా రెచ్చ గొడుతున్నా మాట తూలకుండా ప్రశాంతంగా ఉండే స్థితిని చెప్పటానికి ఇలా బోలెడు పదాలున్నాయి. కనీసం అర్నెల్లుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిపోయినట్టేనని తరచు చెబుతూవచ్చారు. అందుకు మన దేశంనుంచి ఆశాజనకమైన స్పందన రానప్పుడల్లా రెచ్చిపోయి మాట్లాడారు. పాకిస్తాన్ పౌర, సైనిక అధినేతల్ని నెత్తినెక్కించుకుని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. జమ్మూ--కశ్మీర్ భౌగోళిక చిత్రపటాన్ని పాకిస్తాన్ సంబరపడేలా మార్చేశారు. ఎన్ని చేసినా మన ప్రభుత్వం మౌనంగా ఉండిపోవటం, లేదా ఆచితూచి మాట్లాడటం పనికొచ్చినట్టుంది. ఎట్టకేలకు మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి భారత--అమెరికాల మధ్య ఒక అవగాహన కుదిరిందని మొన్న శనివారం అధికారికంగా ఉమ్మడి ప్రకటన వెలువడింది. అందుకు సంబంధించిన ఒక అమరిక (ఫ్రేమ్‌వర్క్) కూడా రూపొందింది. అంతే... వెనువెంటనే 25 శాతం అదనపు సుంకాలు రద్దయ్యాయి. ఇకపై సుంకాలు 18 శాతానికి మాత్రమే పరిమితమవుతాయని అమెరికా ప్రకటించింది. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అనిశ్చితి అలముకున్న తరుణంలో మన దేశం ఈ మాదిరి ఒప్పందానికి సంసిద్ధం కావటం ఒక సాహసోపేతమైన చర్య. అయితే 'ఇల్లలకగానే పండగ కాద'న్నట్టు ఈ ఒప్పందం వాస్తవ రూపం దాల్చేవరకూ ఒకింత ఉత్కంఠ, సంశయం తప్పవు. అటు తర్వాత కూడా దిన దిన గండం ఉండనే ఉంటుంది. అక్కడున్నది ట్రంప్ గనుకే ఈ సమస్య. ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వు గమనిస్తే ఇది తెలుస్తుంది. 'భారత్ ఇకపై రష్యా నుంచి చమురు కొనడం ఆపేసి, ఆ ఉత్పత్తులను అమెరికా నుంచే కొంటుందని ఆశిస్తున్నామ'ని అందులో ఉంది. భారత-- రష్యా చమురు వాణిజ్యంపై తమ నిఘా ఉంటుందని కూడా అంటున్నది. ఈ విషయంలో మన దేశం అధికారికంగా ఏమీ చెప్పలేదు. ఉమ్మడి ప్రకటనలోనూ ఆ ప్రస్తావ-నలేదు. కానీ జాతీయ ఇంధన ప్రయోజనాలే మన గీటురాయి అని గతంలో మోదీ అన్నారు. మన వ్యవసాయ, పాడి రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టే ప్రశ్నే లేదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ చెబుతున్నారు. అలాగే అమెరికా వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు సుంకాలు తగ్గించబోమంటున్నారు. అయితే ఉమ్మడి ప్రకటనలో అమెరికాకు సంబంధించిన అన్ని పారిశ్రామిక సరుకులు, విస్తృతశ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు లేదా రద్దు చేయటానికి భారత్ అంగీకరించిందని ఉంది. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. లేనట్టయితే భారత్ వెనక్కి తగ్గిందని ట్రంప్ యాగీ చేయటంతోపాటు, అదనపు సుంకాలకు సాకుగా ఉపయోగించుకుంటారు. ప్రస్తుత భారత-- అమెరికా వాణిజ్యం 13,000 కోట్ల డాలర్ల మేర ఉంది. ఇందులో అమెరికాకు మన ఎగుమతులు 8,500 కోట్ల డాలర్ల వరకూ ఉంటే, అమెరికా నుంచి దిగుమతులు 4,500 కోట్ల డాలర్ల వరకూ ఉన్నాయి. అంటే మనం 4,000 కోట్ల డాలర్ల వాణిజ్య మిగులులో ఉన్నాం. దీన్ని మార్చాలన్నదే ట్రంప్ తాపత్రయం. అందుకే వచ్చే అయిదేళ్లలో అమెరికా నుంచి 50,000 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులుండేలా ఒప్పందం నిర్దేశిస్తోంది. ఇంధనం ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు,సాంకేతిక ఉత్పత్తులు, అరుదైన లోహాల వంటివి ఉంటాయంటున్నారు. అంటే ఆ దేశంనుంచి ఏటా అదనంగా వందకోట్ల డాలర్ల అదనపు ఉత్పత్తులు వస్తాయి. అప్పుడు మన వాణిజ్య మిగులు ఆవిరై, లోటులో పడుతుంది. దీన్ని ఏ విధంగా సర్దుబాటు చేస్తారు కార్మికుల అవసరం ఎక్కువుండే మన ఉత్పత్తులకు ఒప్పందం వల్ల భారీ ప్రయోజనం కలిగే అవకాశమైతే ఉంటుంది. ఆ రకంగా దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగవు తాయి. ఇక జన్యుమార్పిడి ఆహారం అనారోగ్యహేతువని, ఆ విత్తనాల వల్ల దిగుబడి భారీగా వచ్చినా, అవి వాడిన పంటపొలాల్లో భవిష్యత్తులో దేశీయ విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉండదని గతంలో భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఆ విషయంలో సందే హాలన్నీ నివృత్తి చేయాలి. అలాగే తుది ఒప్పందం సమయానికి అవసరమైన మార్పులు, చేర్పులకు ఇరుపక్షాలూ సిద్ధపడే షరతుపైనే ఏ ఒప్పందంపైనైనా సంతకం చేయాలి.

# వన్య ప్రాణుల వలస



ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సంచరించే పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు ఇవాళ మన ఇళ్ల గడప వరకూ వచ్చేస్తున్నాయి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని అటవీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం వన్యమృగాల దూకుడు మాత్రమే కాదు, మనిషి దుందుడుకు చర్యలకు ప్రతిస్పందన కూడా! అడవులను నరికివేయడం, ఖనిజాల వెలికితీత పేరుతో బడా కార్పొరేట్లకు భూములను కట్టబెట్టడం, అభివృద్ధి పేరుతో ప్రకృతి సిద్ధమైన సహజ ఆవాసాలను, టూరిజం పేరుతో కొండలు, గుట్టలను ఛిద్రం చేయడం వంటి దుశ్చర్యల ఫలితమే ఈ సంఘర్షణ. వన్యప్రాణుల వలసకు మూల కారణం మానవాభివృద్ధి తెచ్చిన దురాశ. దేశంలో 1951లో 40.4 శాతం అడవి ప్రదేశం ఉండగా, ఇప్పుడది 21.7 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులు, మైనింగ్, రోడ్లు, రియల్ ఎస్టేట్‌లు సహజ అడవులను మింగేస్తున్నాయి. దాదాపు 70 శాతం మంది భారతీయులు అడవులకు సమీపంలోనే నివసిస్తున్నారు. మనిషి– వన్యప్రాణుల సంఘర్షణ వల్ల ప్రతి సంవత్సరం 500 మందికి పైగా మరణిస్తున్నారని ప్రభుత్వ లెక్క. ఇది వందలాది వన్యమగాల మరణాలకూ కారణమౌతోంది. 'భూమి అందరికి తప్పనిసరి, కానీ ఇది మనందరి ఆస్తి కాదు' అంటారు గాంధీజీ. కానీ, మనం అడవులను సొంత 'ఆస్తి'గా భావిస్తూ... విధ్వంసానికి పాల్పడుతుండటం వల్లే ప్రకృతి తిరుగుబాటు చేస్తోంది. తాజాగా తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు ఆరు రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసిందో పెద్దపులి. ఎట్టకేలకు అటవీశాఖ సిబ్బంది దానికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. తెలంగాణలోని జనగామ, సిద్దిపేట జిల్లాల పరిధిలోనూ పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఇళ్లలోకి, పంట పొలాల్లోకి వచ్చేస్తున్నాయి. ఏనుగులు సైతం పంట పొలాల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. నెమళ్లు వంటి అరుదైన పక్షులకూ భద్రత లేకుండాపోయింది. వన్య ప్రాణులు అడవి దాటి, జనారణ్యంలోకి రావడానికి ప్రధాన కారణం... మనం అడవిగా భావిస్తున్న ప్రాంతంలో అవి జీవించలేకపోవడం. వాటికి కావాల్సిన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అవి బిక్కుబిక్కుమంటూ రోడ్ల మీదకు రావు. మనిషిలోని నాగరిక లాభాపేక్ష వృక్ష, జంతు, పక్షి జాతుల వేగవంతమైన క్షీణతకు దారితీస్తోంది. ఇది సహజ పర్యావరణ వ్యవస్థలను భంగపరచడంతో పాటు, జీవవైవిధ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. 'ఒక ఆకు పడిపోతే ఆ మొక్క నొప్పి పడదా?' అంటారు రామకృష్ణ పరమహంస. అలాగే, ఒక చెట్టు పడిపోయినా ప్రకృతి నొప్పి పడుతుంది. ఇప్పుడు దేశానికి కావాల్సింది సానుభూతి కాదు– అడవుల నరికివేతను అరికట్టాలన్న దృఢనిర్ణయం, మానవుల నుంచి రక్షణ కల్పించడం. 'ప్రకృతి మనకు ఇచ్చిన బహుమతి అడవి. మనం దాన్ని కాపాడాలి' అంటారు పర్యావరణవేత్త రఘుచంద్రన్. ప్రకృతిపై మనిషికి అధికారం లేదు... బాధ్యత మాత్రమే వుంది అన్న విషయాన్ని గుర్తించాలి. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం. కానీ, భారతదేశంలో జనాభా విస్ఫోటనం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధి వంటి కార్యకలాపాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పర్యావరణ అసమతుల్యత ఏర్పడుతోంది. వన్య మృగాలను చూసినప్పుడు, వాటిని హింసించకుండా... అధికారులకు తెలియజేయాలి. గ్రామాల్లో అవేర్‌నెస్ క్యాంపెయిన్లు నడపాలి. సంబంధిత ప్రభుత్వ శాఖలు సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోవడం, ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటూనే, హింసకు దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించడం అత్యవసరం. కేరళలో 'వన్యమృగ బీటర్లు' వంటి స్వచ్ఛంద సంఘాలు వన్య మృగాలను పట్టి, అడవుల్లో విడిచిపెడతారు. అలాగే, సోలార్ ఫెన్సింగ్, బయోఫెన్సింగ్ వాడుతారు. వన్యప్రాణులను మన 'అతిథులు'గా చూడాలి. వాటిని తిరిగి అడవిలోకి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అడవుల పునరుద్ధరణకు పూనుకోవాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలి. మనిషిని, వన్యమృగాన్ని రక్షించే ఏకైక మార్గం...అడవులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న సంగతి గుర్తించాలి.

## పచ్చ బంగారం గురించి తెలుసా రైతులకు కోట్ల ఆదాయం ఇచ్చే కల్పవృక్షం




సాంప్రదాయ వ్యవసాయం, ప్రమాదకర స్టాక్ మార్కెట్ మధ్య.. రిస్క్ చాలా తక్కువగా, కోట్లలో లాభం వచ్చే మార్గం ఒకటి ఉంది. అదే 'మహోగని' చెట్ల పెంపకం.దీనిని నేటి కాలంలో గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్ అని అంటున్నారు. మీకు కొంచెం ఖాళీ భూమి ఉంటే, అక్కడ మహోగని నాటడం ద్వారా మీరు మీ భవిష్యత్ తరానికి పెద్ద బ్యాంక్ బ్యాలెన్స్‌ను సిద్ధం చేసుకోవచ్చు.

### ఇది చెక్క కాదు.. 'పచ్చ బంగారం'

మహోగని దాని విలువైన ఎర్రటి-గోధుమ రంగు కలపకు ప్రసిద్ధి చెందింది. ఇది చాలా బలంగా మెరిసేదిగా, నీటికి నిరోధకతను కలిగి ఉంటుంది. ఇది సాధారణంగా నౌకానిర్మాణం, సంగీత వాయిద్యాలు (గిటార్లు, పియానోలు), ప్రీమియం ఫర్నిచర్‌లో ఉపయోగించబడుతుంది.


అంతర్జాతీయ మార్కెట్‌లో దీనికి ఉన్న భారీ డిమాండ్ కారణంగా దీనిని 'కింగ్ ఆఫ్ వుడ్స్' అని పిలుస్తారు. ఒక ఎకరం నుండి ఎంత ఆదాయం వస్తుందో ఇప్పుడు చూద్దాం.. ఒక ఎకరం భూమిలో సుమారు 400 నుండి 500 మహోగని చెట్లను నాటవచ్చు. ఈ చెట్లు 12 నుండి 15 సంవత్సరాలలో పూర్తిగా పరిపక్వం చెందుతాయి.ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం.. పూర్తయిన చెట్టు కలపను సులభంగా రూ.40 నుండి 50 వేలకు అమ్మవచ్చు. మీరు 500 చెట్లను నాటితే, 15 సంవత్సరాల తర్వాత మీ మొత్తం సంపాదన దాదాపు రూ.2 కోట్లు కావచ్చు. కలప మాత్రమే కాదు, విత్తనాలు, ఆకులు కూడా విలువైనవే. మహోగని ప్రత్యేకత ఏమిటంటే దానిలోని ప్రతి భాగం క్రియాత్మకంగా ఉంటుంది. దీని విత్తనాలను మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులకు ఔషధం తయారు చేయడానికి ఉపయోగిస్తారు.సహజ పురుగుమందులను దీని ఆకుల నుండి తయారు చేస్తారు. అంటే కలపను విక్రయించడానికి ముందే, మీరు దాని విత్తనాలను అమ్మడం ద్వారా ప్రతి సంవత్సరం అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఈ చెట్టుకు ఎక్కువ నీరు లేదా ఎరువులు అవసరం లేదు, వ్యాధులకు కూడా తక్కువ అవకాశం ఉంది. మార్కెట్ హెచ్చుతగ్గులకు భయపడవద్దు, కాలక్రమేణా కలప ధర పెరుగుతుంది. మొదటి 5-6 సంవత్సరాలు, చెట్ల మధ్య ఖాళీ స్థలంలో చిక్కుళ్ళు, కూరగాయలు లేదా ఔషధ మొక్కలను నాటడం ద్వారా మీరు క్రమం తప్పకుండా ఆదాయం పొందవచ్చు. ఈ చెట్టు కార్బన్‌ను గ్రహించడంలో నైపుణ్యం కలిగి ఉంటుంది, ఇది మీ నేల మరియు పర్యావరణం సారాన్ని మెరుగుపరుస్తుంది.

## హైడ్రాకు రోజుకు లక్ష జరిమానా.. ప్రైవేట్ స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటుపై హైకోర్టు ఆగ్రహం




హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ ప్రైవేట్ వ్యక్తులకు చెందిన స్థలానికి ఫెన్సింగ్ వేసిన హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా ఫెన్సింగ్ వేసినందునకు బాధిత పిటిషనర్లకు రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించింది. తక్షణం ఫెన్సింగ్ తొలగించాలని, లేనిపక్షంలో అది తొలగించేదాకా రోజుకు రూ.లక్ష చొప్పున పిటిషనర్లకు చెల్లించాలని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా ఉప్పల్ మండలం మల్లాపూర్‌లో సర్వే నం.100లో బాబానగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ లేఔట్‌లోని రెండు ప్లాట్‌లకు హైడ్రా కంచె వేయడాన్ని సవాలు చేస్తూ జొన్నలగడ్డ పద్మిని మరొకరు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టి వాస్తవాల నిర్ధారణకు అడ్వకేట్ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. అడ్వకేట్ కమిషన్ విచారణ జరిపి తమ నివేదికను బుధవారం న్యాయమూర్తికి అందజేశారు. అడ్వకేట్ కమిషనర్ విచారణలో విస్తుగొలిపే అంశాలు బయటపడ్డాయి. పిటిషనర్లు, హైడ్రా వేర్వేరు లేఔట్‌లు సమర్పించారని, ఒకదానికొకటి పొంత న లేదని పేర్కొన్నారు. హైడ్రా సమర్పించిన లేఔట్‌లో పిటిషనర్లకు చెందిన ప్లాట్ నంబర్లు లేకపోవడంతో కంచె వేశారని పేర్కొన్నారు.అయితే ఈ స్థలాలకు సంబంధించిన హకులపై పిటిషనర్‌లు కింది కోర్టును ఆశ్రయించారని, ఇందులో జీహెచ్‌ఎంసీ ప్రతివాదిగా ఉన్నదని తెలిపారు. విచారణ జరిపిన కింది కోర్టు ఈ ప్లాట్‌లపై ప్రైవేట్ వ్యక్తులకు హకులున్నాయని ధ్రువీకరిస్తూ, శాశ్వత ఇంజంక్షన్ ఆర్డర్ జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసినప్పటికీ జీహెచ్‌ఎంసీ కంచె వేయడానికి అనుమతించిందని తెలిపారు. ఈ నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి హైడ్రా తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రభుత్వ స్థలాలను రక్షించవద్దని, కంచె వేయవద్దని ఎవరూ చెప్పడంలేదని, అయితే ఆధారాలను ధ్రువీకరించుకొని, బాధితుల వాదనను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు విరుద్ధంగా ఎవరు ఫిర్యాదు ఇచ్చినా వాస్తవాలను ధ్రువీకరించుకోకుండా ఫెన్సింగ్ వేయడం సరికాదని చెప్పారు. ఫెన్సింగ్ వేయాలంటే సంబంధిత కోర్టు, లేదంటే హైకోర్టు అనుమతి తీసుకోవాలని స్పష్టంచేశారు. ప్రైవే ట్ స్థలంలో వేసిన కంచెను తక్షణం తొలగించాలని, అంతేగాకుండా పిటిషనర్లకు రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించారు.

## ప్రధాని మోడీకి ఇజ్రాయెల్ అత్యున్నత గౌరవ పురస్కారం..



రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ఇజ్రాయెల్ చేరుకున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన భార్య సారా నెతన్యాహు విమానాశ్రయంలో మోడీకి స్వాగతం పలికారు.ఆ తర్వాత ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు, అక్కడ ఆయనకు పార్లమెంటు అత్యున్నత గౌరవమైన స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ పతకం లభించింది. నెస్సెట్‌ను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ, ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులను ఖండించారు."మీ బాధను మేము అర్థం చేసుకున్నాము. భారతదేశం చాలా కాలంగా ఉగ్రవాదంతో బాధపడుతోంది. భారతదేశం ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తుంది" అని ఈ సందర్భంగా ప్రధాని మోడీ చెప్పారు. ఇక ఇజ్రాయేల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ "మోడీ నాకు సోదరుడిలాంటివాడు; నా హృదయంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది" అని అన్నారు. మోడీని ఆసియా సింహం అని, ప్రపంచ గౌరవనీయ నాయకుడు అని ఆయన అభివర్ణించారు.

### ఇజ్రాయేల్ లో తొలిసారిగా..

నెస్సెట్‌ను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానమంత్రి మోడీ. ఆయన పార్లమెంటుకు చేరుకున్న వెంటనే, శాసనసభ్యులు ఆయనకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి "మోడీ, మోడీ!" అని నినాదాలు చేశారు.

### ప్రధాని మోడీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

"ఇజ్రాయెల్ పార్లమెంటులో మాట్లాడటం గౌరవంగా భావిస్తున్నాను - ఇజ్రాయెల్ పార్లమెంటు ముందు నిలబడటం నాకు గౌరవంగా భావిస్తున్నాను. నేను ఒక పురాతన నాగరికత, భారతదేశాన్ని సూచిస్తున్నాను. మరొక పురాతన నాగరికతను ఉద్దేశించి ప్రసంగిస్తున్నాను."

### నేను 140 కోట్ల మంది భారతీయుల తరపున

140 కోట్ల మంది భారతీయుల తరపున, మీకు శుభాకాంక్షలు, స్నేహం, గౌరవం, బలమైన భాగస్వామ్యం సందేశాన్ని తీసుకువచ్చాను.

భారతదేశంలో యూదులు ఎప్పుడూ సురక్షితంగా ఉన్నారు - భారతదేశంలోని యూదు సమాజం భయం, వివక్ష లేదా హింస లేకుండా జీవించిందని నేను గర్వంగా చెప్పగలను. వారు తమ విశ్వాసాన్ని కాపాడుకున్నారు.

### భారతదేశం-ఇజ్రాయెల్ సంబంధాలు

మన దేశాల మధ్య సంబంధాలు 2,000 సంవత్సరాలకు పైగా నాటివి. భారతదేశం - ఇజ్రాయెల్ 2,000 సంవత్సరాల నాటి బంధాన్ని పంచుకుంటాయి. ఎస్తేర్ పుస్తకం భారతదేశం గురించి ప్రస్తావించగా, టాల్ముడ్ మన వాణిజ్య సంబంధాల గురించి ప్రస్తావించింది.

### మొదటి ప్రపంచ యుద్ధంలో భారత సైనికుల ప్రాణత్యాగం

మొదటి ప్రపంచ యుద్ధంలో ఈ ప్రాంతంలో 4,000 కంటే ఎక్కువ మంది భారతీయ సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. మా సంబంధం రక్తం - త్యాగంలో కూడా పాతుకుపోయింది.

### ఉగ్రవాదం ఎప్పుడూ సమర్థనీయం కాదు

కారణం చేతనైనా పౌరులను చంపడం సమర్థించబడదు. ఉగ్రవాదం ఎప్పుడూ సమర్థనీయం కాదు. భారతదేశం కూడా ఉగ్రవాద బాధను చవిచూసింది. కాబట్టి మా విధానం స్పష్టంగా - దృఢంగా ఉంది.

### గాజా చొరవకు మద్దతు

నేను ఖచీూజ మద్దతు గల గాజా శాంతి చొరవకు మద్దతు ఇస్తున్నాను. ఈ చొరవ ఈ ప్రాంతానికి న్యాయమైన- శాశ్వత శాంతిని తీసుకురాగలదని నేను నమ్ముతున్నాను. చర్చలు, శాంతి, స్థిరత్వం కోసం భారతదేశం మీతో నిలుస్తుంది.

### నెతన్యాహు ప్రసంగంలో ముఖ్యాంశాలు..

భారతదేశంలో యూదులు ఎప్పుడూ హింసకు గురికాలేదు భారతదేశంలో యూదులు ఎప్పుడూ హింసకు గురికాలేదు. భారతదేశం కారణంగా, యూదు సమాజం ఎప్పుడూ గౌరవం పొందింది.

### భారతదేశం-ఇజ్రాయెల్ సంబంధాలు ప్రత్యేకమైనవి

రెండు దేశాల మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైనవి మాత్రమే కాదు, హృదయపూర్వకమైనవి కూడా. భారతదేశం-ఇజ్రాయెల్ కూటమి రెండు దేశాల బలాన్ని పెంచుతుంది.

### 'మోడీ హగ్' నిజమైన స్నేహానికి చిహ్నం

'మోడీ హగ్' ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇది ఒక లాంఛనప్రాయం కాదు, నిజమైన సంబంధానికి సంకేతం.


### భాగస్వామ్యం బలాన్ని పెంచుతుంది

రెండు దేశాలు వాణిజ్యాన్ని రెట్టింపు చేశాయి. సహకారాన్ని మూడు రెట్లు పెంచాయి. పరస్పర అవగాహనను నాలుగు రెట్లు పెంచాయి. ఈ కూటమి రెండు దేశాల బలాన్ని పెంచుతుంది.

### మోడీ నాకు స్నేహితుడు మాత్రమే కాదు సోదరుడు కూడా..

మోదీ నాకు గొప్ప స్నేహితుడు మరియు ప్రపంచ వేదికపై ప్రముఖ నాయకుడు. నేను ఆయనను కేవలం ఒక స్నేహితుడు మాత్రమే కాదు, ఒక సోదరుడిగా భావిస్తాను. ప్రధాని మోడీ ఆసియా సింహం.

## హైదరాబాద్, నుంచి వైజాగ్ వెళ్లే వారికి ఇక పండగే! 56 కి.మీ దూరం తగ్గనుంది




తెలుగు రాష్ట్రాల రవాణా ముఖచిత్రాన్ని మార్చేస్తూ, ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మించిన మొదటి 'యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్' హైవే ప్రారంభానికి సిద్ధమైంది.అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించడమే కాకుండా, విదేశీ తరహా అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో ఈ రహదారిని తీర్చిదిద్దారు. పర్యావరణ హితంగా, భద్రతకు పెద్దపీట వేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు మే నెలలో సామాన్యులకు అందుబాటులోకి రానుందిప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే సూర్యాపేట, విజయవాడ మీదుగా సుమారు 676 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అయితే, ఎన్‌హెచ్-365బీజీగా పిలిచే ఈ కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తే, ఆ దూరం 56 కిలోమీటర్ల మేర తగ్గనుంది. ఖమ్మం సమీపంలోని తల్లంపాడు నుంచి ఏలూరు జిల్లా మీదుగా దేవరపల్లి వరకు 162.04 కి.మీ పొడవునా నిర్మించిన ఈ రహదారి వల్ల ప్రయాణ సమయం ఆదా కావడమే కాకుండా ఇంధన ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుంది.

### యాక్సెస్ కంట్రోల్డ్: హైవేపై పూర్తి నియంత్రణ

ఈ రహదారి ప్రత్యేకత ఏమిటంటే.. ఇది 'యాక్సెస్ కంట్రోల్డ్' పద్ధతిలో పనిచేస్తుంది. అంటే సాదాసీదా రోడ్లలాగా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు లోపలికి రావడానికి లేదా బయటకు వెళ్లడానికి వీలుండదు. మొత్తం 162 కిలోమీటర్ల పరిధిలో కేవలం 9 చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల వేగంగా వెళ్లే వాహనాలకు అడ్డంకులు ఉండవు మరియు ప్రమాదాల ముప్పు తక్కువగా ఉంటుంది. అలాగే, వాహనదారులు ప్రయాణించిన దూరానికే టోల్ వసూలు చేసే అత్యాధునిక వ్యవస్థను ఇక్కడ అమలు చేస్తున్నారు.

కోనసీమ జిల్లా ప్రజల చిరకాల వాంఛ జాతీయ రహదారి 216జుపై కీలక అప్డేట్

### టెక్నాలజీతో నిఘా:

ఏటీఎంఎస్ భద్రత విషయంలో ఈ హైవే సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఊమీూ) ద్వారా ఈ రోడ్డుపై నిరంతర నిఘా ఉంటుంది.360 డిగ్రీల సీసీ కెమెరాలు: ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక కెమెరాను అమర్చారు. ఇది రోడ్డుకు రెండు వైపులా కిలోమీటరు మేర దృశ్యాలను రికార్డు చేస్తుంది.నిబంధనల అమలు: అతివేగం, సీటు బెల్టు లేకపోవడం, రాంగ్ రూట్ ప్రయాణం వంటి ఉల్లంఘనలు జరిగితే కెమెరాలు వెంటనే గుర్తించి ఏటీఎంఎస్‌కు సమాచారం అందిస్తాయి. వెంటనే బాధ్యులకు ఈ-చలాన్లు అందుతాయి.క్యూఆర్ కోడ్ సదుపాయం: రహదారి పొడవునా ఉండే క్యూఆర్ కోడ్ బోర్డులను స్కాన్ చేయడం ద్వారా దగ్గర్లోని పోలీస్ స్టేషన్, పెట్రోల్ బంక్, ఆస్పత్రుల వివరాలను తెలుసుకోవచ్చు.తెలంగాణలో మరో 4 వరుసల జాతీయ రహదారి.. ఇక దూసుకెళ్లొచ్చు..

### పర్యావరణ హితం, మౌలిక వసతులు

కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 4,451.87 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో పర్యావరణానికి పెద్దపీట వేశారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా రోడ్డు నిర్మాణంలో రామగుండం ఎన్టీపీసీ నుంచి సేకరించిన ఫ్లైయాష్‌ను వినియోగించారు. రహదారి పొడవునా సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు, ఇవి పగలు బ్యాటరీలను ఛార్జ్ చేసుకుని రాత్రివేళ ఆటోమేటిక్ గా వెలుగుతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి 50 కిలోమీటర్లకు ఒకచోట హోటళ్లు, వాష్‌రూమ్స్ మరియు విశ్రాంతి గదులతో కూడిన సముదాయాలను నిర్మిస్తున్నారు.తెలుగు రాష్ట్రాల్లో గ్రీన్ ఫీల్డ్ హైవేల శకానికి ఖమ్మం-దేవరపల్లి రహదారి నాంది పలుకుతోంది. నాగ్‌పూర్-అమరావతి హైవేకి అనుసంధానం కావడంతో పాటు, వాణిజ్యపరంగా కూడా ఈ రోడ్డు కీలకం కానుంది. కేవలం ప్రయాణ సౌకర్యమే కాకుండా, అంతర్జాతీయ స్థాయి భద్రతా ప్రమాణాలతో రూపొందిన ఈ 'స్మార్ట్ హైవే' మే నెలలో పట్టాలెక్కేందుకు సర్వం సిద్ధమైంది.

## నేటి నుంచి రాజ్యసభ నామినేషన్లు.. నోటిఫికేషన్ జారీ చేయనున్న ఈసీ




దిశ, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో రెండు రాజ్యసభ సీట్లు ఏప్రిల్ 9న ఖాళీ కాబోతున్నాయి. బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీల పదవీకాలం ముగియబోతోంది.దీంతో ఈ రెండు సీట్ల భర్తీకి నేడు ఈసీ నోటిఫికేషన్ జారీ చేయనున్నది. నామినేషన్ల ప్రక్రియ నేటి నుంచే ప్రారంభం కానుండగా మార్చి 5 వరకు గడువు, 6న నామినేషన్ల పరిశీలన, మార్చి 9న ఉపసంహరణకు అవకాశం కల్పించనున్నారు. 16వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. అయితే రెండు పోస్టులు కూడా సంఖ్యా బలం దృష్ట్యా కాంగ్రెస్ పార్టీకే దక్కనున్నాయి. రెండు సీట్లలో ఒకటి అభిషేక్ సింఘ్వీకి కేటాయించి మరోసారి రాజ్యసభకు పంపే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక మిగిలిన సీటు కోసం చాలామంది సీనియర్ నేతలు ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ పెద్దలను కలుస్తుండగా, మరికొందరు సీఎం, టీపీసీసీ చీఫ్‌ల దగ్గర తమ ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలిసింది.

### సీనియర్ల ప్రయత్నాలు..

సీనియర్ నేత చిన్నారెడ్డి ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను ఢిల్లీలో కలిసి తనకు రాజ్యసభ సీటు ఇవ్వాలని కోరారు. మరో సీనియర్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సైతం రాజ్యసభ సీటుపై సీఎం, టీపీసీసీ అధ్యక్షుడిని కోరనున్నట్లు తెలిపారు. సామాజిక సమీకరణాలు, పార్టీకి సేవ కోణంలో మాజీ ఎంపీ వీహెచ్, జెట్టి కుసుమ కుమార్‌లు సైతం పదవిని ఆశిస్తున్నారు. ఇటీవల ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. అలాగే ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేరు కూడా లిస్టులో ఉన్నట్టు తెలిసింది. వీరితోపాటు సీనియర్ నేత జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, ఎస్టీ కోటాలో బెల్లయ్య నాయక్‌లు సైతం పదవిని ఆశిస్న?న్నారు. చివరి నిమిషంలో కొత్త పేర్లు కూడా తెరపైకి రావొచ్చని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

## భారత్ సహా 40 దేశాల పౌల్ట్రీ ఉత్పత్తులపై సౌదీ అరేబియా నిషేధం

చీవఝం వీవ్వతీ తెలుగుసౌదీ అరేబియా ఆహార మరియు ఔషధ నియంత్రణ సంస్థ భారత్ సహా దాదాపు 40 దేశాల నుంచి కోడి మాంసం (పౌల్ట్రీ), టేబుల్ ఎగ్స్ దిగుమతులపై పూర్తిస్థాయి నిషేధాన్ని విధించింది.ప్రజారోగ్యాన్ని రక్షించడంతో పాటు దేశంలోకి వచ్చే ఆహార ఉత్పత్తుల భద్రతను నిర్ధారించే క్రమంలో ఈ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ముఖ్యంగా వివిధ దేశాల్లో ప్రబలుతున్న బర్డ్ ఫ్లూ (ఏవియన్ ఇన్ఫ్లుఎంజా) వంటి వ్యాధుల ముప్పును తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సౌదీ



అరేబియా స్పష్టం చేసింది.

### నిషేధానికి గురైన దేశాలు:

భారత్‌తో పాటు అఫ్గానిస్తాన్, జర్మనీ, ఇండోనేషియా, ఇరాన్, బల్గేరియా, బంగ్లాదేశ్, తైవాన్, దక్షిణాఫ్రికా, చైనా, ఇరాక్, వియత్నాం, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, యునైటెడ్ కింగ్‌డమ్, ఈజిప్ట్, మెక్సికో, నేపాల్, నైజీరియా, హాంకాంగ్, జపాన్ వంటి మొత్తం 40 దేశాలపై పూర్తిస్థాయిలో నిషేధం ఉంది. ఇవే కాకుండా ఆస్ట్రేలియా, అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, కెనడా, మలేషియా వంటి మరో 16 దేశాల్లోని కొన్ని నిర్దిష్ట ప్రాంతాలపై పాక్షిక ఆంక్షలు విధించారు.

### ముఖ్య నిబంధనలు:

ప్రపంచవ్యాప్తంగా వ్యాధుల వ్యాప్తి మరియు ఎపిడెమియోలాజికల్ పరిస్థితులకు అనుగుణంగా ఈ దేశాల జాబితాను ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని ూళీణూ తెలిపింది. అయితే, తగిన ఉష్ణోగ్రత వద్ద ఉడికించిన (ఎమ్‌తీమ్‌ఎవత్) పౌల్ట్రీ ఉత్పత్తులకు మరియు నిర్ణీత ఆరోగ్య భద్రతా ప్రమాణాలను పాటించే వాటికి ఈ తాత్కాలిక నిషేధం వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. అంతర్జాతీయ నివేదికల ఆధారంగా 2004 నుంచి కొన్ని దేశాలపై ఆంక్షలు కొనసాగుతుండగా, వ్యాధుల తీవ్రతను బట్టి కొత్త దేశాలను ఈ జాబితాలో చేరుస్తున్నట్లు సౌదీ అరేబియా పేర్కొంది.

## మనం మళ్లీ గెలవబోతున్నాం. ప్రపంచాన్ని కొత్త దారిలో పెడతా




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగం ద్వారా మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. సుమారు 100 నిమిషాల పాటు సాగిన ఈ సుదీర్ఘ ప్రసంగం కేవలం ప్రభుత్వ నివేదికలా కాకుండా, రాబోయే ఎన్నికల ప్రచార అస్త్రంగానూ, అమెరికా పారిశ్రామిక శక్తి ప్రదర్శనగానూ నిలిచింది.అమెరికా ఆర్థిక వ్యవస్థ గతంలో కంటే చాలా బలంగా ఉందని, తమ పాలనలో దేశంలో తయారీ రంగం, ఉద్యోగాల సృష్టిలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "మనం ఎంతగా విజయం సాధించబోతున్నామంటే.. భారీ విజయాలను భరించలేకపోతున్నాం అధ్యక్షా అని ప్రజలే వేడుకునే స్థాయికి దేశాన్ని తీసుకెళ్తాం" అంటూ తనదైన శైలిలో అతిశయోక్తులతో కూడిన ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించారు.

### 'సుంకాలు' దేశ ఆర్థిక ప్రయోజనా కోసమే..

వాణిజ్య పరంగా ట్రంప్ అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. ఇతర దేశాల నుంచి వచ్చే దిగుమతులపై విధించే 'సుంకాలు' అమెరికా ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతున్నాయని ఆయన గట్టిగా సమర్థించుకున్నారు. ఈ విషయంలో తనకు పార్లమెంటు (కాంగ్రెస్) ఆమోదంతో పనిలేదని, అవసరమైతే ప్రత్యామ్నాయ చట్టాలను ఉపయోగించి ప్రతీకార సుంకాలను విధిస్తానని హెచ్చరించారు. విదేశీ వస్తువులపై విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, అది దేశ ప్రయోజనాలకు విఘాతమని వ్యాఖ్యానించారు. నవంబర్‌లో జరగబోయే ఎన్నికల్లో డెమోక్రాట్లకు ఓటు వేస్తే దేశం ధ్వంసం అవుతుందని ఓటర్లను హెచ్చరిస్తూ రాజకీయ వేడిని పెంచారు.

### ఆకాశంలో మొదలైన ప్రేమ కథ. ఆయన్ని మైమరిపించిన సారా!

### తాను జోక్యం చేసుకోకపోతే.. మళ్లీ అదే పాత పాట.

అంతర్జాతీయ సంబంధాల విషయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇరాన్ సమస్యను యుద్ధం ద్వారా కాకుండా దౌత్యపరంగా పరిష్కరించడమే తన ప్రాధాన్యతని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల గురించి ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తాను జోక్యం చేసుకోకపోతే ఇరు దేశాల మధ్య యుద్ధం జరిగి 3.5 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయేవారని, ఈ విషయాన్ని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్వయంగా తనతో చెప్పారని వెల్లడించారు. ఈ క్రమంలో "నేను లేకపోతే పాక్ ప్రధాని చనిపోయి ఉండేవారు" అని పొరపాటున నోరు జారినప్పటికీ, వెంటనే తేరుకుని భారీ ప్రాణనష్టం గురించి వివరించారు.

### నిలిచిపోయిన 'గ్లోబల్ ఎంట్రీ' సేవలు

### ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్..

ప్రసంగం మధ్యలో సభకు హాజరైన ప్రత్యేక అతిథులను పరిచయం చేయడం ద్వారా ట్రంప్ సభలో ఉద్వేగభరిత వాతావరణాన్ని సృష్టించారు. యుద్ధ వీరులతో పాటు, కెనడాపై స్వర్ణ పతకం సాధించిన అమెరికా హాకీ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన గోల్‌కీపర్ హెల్‌బ్యాక్‌కు అమెరికాలో అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'ను అక్కడికక్కడే ప్రకటించారు. రాజకీయ వైరుధ్యాలు ఎన్ని ఉన్నా, క్రీడలు మరియు జాతీయ గౌరవం విషయంలో దేశమంతా ఏకతాటిపై ఉండాలని తన ప్రసంగం ద్వారా ట్రంప్ సందేశాన్ని ఇచ్చారు.

## విద్యాశాఖ, ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ : 8వ తరగతి సోషల్ టెక్స్ట్‌బుక్‌లో "న్యాయవ్యవస్థలో అవినీతి" అనే అధ్యాయాన్ని చేర్చినందుకు విద్యాశాఖ కార్యదర్శి మరియు ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేష్ ప్రసాద్ సక్లానీకి సుప్రీంకోర్టు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కారం లేదా ఇతర చట్టాల కింద చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలని నోటీసుల్లో పేర్కొంది. ఎన్‌సిఇఆర్‌టి 8వ తరగతి సోషల్ టెక్స్ట్‌బుక్‌లో ముద్రించిన వివాదాస్పద అధ్యాయాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించిన సంగతి తెలిసిందే. అభివృద్ధి బృందంలోని సభ్యులందరి పేర్లు, అర్హతలు మరియు యోగ్యతా పత్రాలు సహా అధ్యాయాన్ని ఆమోదించిన టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్స్ కమిటీ వివరణాత్మక రికార్డులను సమర్పించాలని ఎన్‌సిఇఆర్‌టిని ఆదేశించింది. "వారు తుపాకీ పేల్చారు.. న్యాయవ్యవస్థ నేడు రక్తసిక్తమవుతోంది" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్‌సిఇఆర్‌టి టెక్స్ట్ బుక్స్‌పై, డిజిటల్ విభాగంపై కూడా పూర్తి నిషేధం విధించింది. ఎన్‌సిఇఆర్‌టి క్షమాపణలు చెప్పినప్పటికీ.. సుమోటోగా విచారణను నిలిపివేసేందుకు ధర్మాసనం నిరాకరించింది. పాఠ్యపుస్తకాలు, డిజిటల్ విభాగంపై కూడా పూర్తి నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది. ఈ ఉత్తర్వులను మీరిన ఏ చర్య అయినా న్యాయపరిపాలనలో ప్రత్యక్ష జోక్యంగా పరిగణించబడుతుందని, కోర్టు ధిక్కారానికి దారితీస్తుందని హెచ్చరించింది.

## తెలంగాణలో ఐఎఎస్‌ల బదిలీలు




హైదరాబాద్ : తెలంగాణలో భారీగా ఐఎఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా, బిసి సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా బాధ్యతలు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.

## ఈడి విచారణకు హాజరైన అనిల్ అంబానీ



న్యూఢిల్లీ : రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) విచారణకు హాజరయ్యారు. రూ.40 వేల కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసులో ఈడి విచారణ చేపడుతోంది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఫిబ్రవరి 26న హాజరుకావాలని ఇటీవల ఈడీ ఆయనకు సమన్లు జారీ చేసింది. దీంతో ఉదయం 10:30 గంటలకు ఆయన సెంట్రల్ ఢిల్లీలోని ఫెడరల్ దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వెళ్లారు. బుధవారం అనిల్‌కు చెందిన ముంబయి నివాసం 'అబోడ్'ను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకుంది. ఈ నివాసం విలువ సుమారు రూ.3,716 కోట్లు ఉంటుందని అంచనా. తాజా వాటితో కలిపి ఈ కేసులో మొత్తం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది. అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు రూ.వేల కోట్ల విలువైన బ్యాంకు రుణాలను తీసుకుని, మోసానికి పాల్పడ్డారని ఈడి కేసు నమోదు చేసింది. గతేడాది ఆగస్టులో అనిల్ అంబానీ ఈడీ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే.

## న్యాయవ్యవస్థపై అవినీతి పాఠం.. 'సుప్రీం' సీరియస్



ఢిల్లీ: ఎన్సీఈఆర్టీ పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అవినీతి పాఠం ఉండటంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై సుమోటోగా కేసు విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం న్యాయవ్యవస్థపై దాడి జరుగుతోందని వ్యాఖ్యానించింది. న్యాయవ్యవస్థ అవినీతిమయమని బోధిస్తున్నారా ? అని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకంలోని ఆ చాప్టర్ ను ఉపసంహరించినా పుస్తకాలు ఆన్లైన్, మార్కెట్లోనే ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. ఈ విచారణ నేపథ్యంలో ఎన్సీఈఆర్టీ క్షమాపణలు తెలిపింది. కేంద్ర విద్యాశాఖ సెక్రటరీ, ఎన్సీఈఆర్టీ చైర్మన్‌లకు ధర్మాసనం షోకాజ్ నోటీస్ జారీ చేసింది. దానిలో కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలని కోరింది. ఈ చాప్టర్‌కి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర , రాష్ట్ర విద్యాశాఖలు సమన్వయంతో వ్యవహరించి సర్క్యులేషన్ లో ఉన్న పుస్తకాలను సీజ్ చేయాలని తెలిపింది. ఫిజికల్, డిజిటల్ ప్లాట్ ఫామ్ లలో ఈ పాఠాన్ని తొలగించాలని, ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ దీనికి వ్యక్తిగతంగా బాధ్యత తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. అన్ని రాష్ట్రాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు ఈ ఆదేశాలను అమలు చేయాలి, అఫిడవిట్ దాఖలు చేయాలి. ఈ వివాదాస్పద కంటెంట్ ను తయారు చేసిన రచయితల పేర్లను, వివరాలు ఇవ్వాలని ధర్మాసనం కోరింది. న్యాయవ్యవస్థ పై దాడి జరుగుతోందని వ్యాఖ్యానించింది.

## ఇజ్రాయెల్‌తో భారత్ పలు కీలక ఒప్పందాలు

జెరూసలేం: ఇజ్రాయెల్‌తో భారత్ పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. పలు ఒప్పందాలపై నరేంద్ర మోదీ-నెతన్యాహు సంతకాలు చేసుకున్నారు. ఇజ్రాయెల్ ప్రధానితో నరేంద్ర మోదీ కీలక సమావేశం నిర్వహించారు. ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భారత్‌లో పర్యటించాలని నెతన్యాహును ప్రధాని మోదీ ఆహ్వానించారు. రక్షణ, వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి. విద్య, వ్యవసాయం, వాణిజ్యం, సైబర్ సెక్యూరిటీ, సర్వీస్ సెక్టార్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆవిష్కరణల రంగంలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్‌లో యూపీఐ వాడకంపైనా భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. రక్షణ రంగంలో పరస్పర సహకారానికి భారత్-ఇజ్రాయెల్ నిర్ణయించాయి. వ్యవసాయం నుంచి ఏఐ వరుకు పలు ఎంవోయూలపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి. 16 ఎంవోయూలపై భారత్??-ఇజ్రాయెల్ సంతకాలు చేసుకున్నాయి. 11 కీలక ప్రకటనలు చేశాయి. టెక్నాలజీ కేంద్రంగా భవిష్యత్ సంబంధాలు ఉంటాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు త్వరలోనే తుదిరూపు ఇస్తామన్నారు. పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు మోదీ పిలుపునిచ్చారు. సంఘర్షణల్లో మానవత్వం బాధితురాలు కాకూడదన్నారు.

## గాలి నుంచి నీరు!

నీరు. సకల జీవరాశులకు ప్రాణాధారం. అలాంటి నీటి లభ్యత ప్రపంచవ్యాప్తంగా నానాటికీ ప్రమాదకర స్థాయికి పడిపోతోంది. ముఖ్యంగా స్వచ్ఛమైన తాగునీటికి దేశాలన్నీ కటకటలాడే రోజు ఎంతో దూరంలో లేదని పలు సర్వేలు ఘోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అత్యంత స్వచ్ఛమైన నీటిని నేరుగా గాలి నుంచే సులువుగా తయారు చేసుకునే టెక్నాలజీని నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ ఒమర్ యాగీ అభివృద్ధి చేశారు. భారీ ప్లాంట్లు, పరికరాల అవసరం లేకపోవడం దీని ప్రత్యేకత. ఇందుకోసం కేవలం ఒక షిప్పింగ్ కంటైనర్ పరిమాణంలో ఉండే యంత్రాన్ని యాగీ రూపొందించారు. ఒక్కో యంత్రం సాయంతో రోజుకు కనీసం 1,000 లీటర్ల నీటిని నేరుగా గాలి నుంచే ఒడిసిపట్టవచ్చు! అంతేకాదు, అత్యంత పొడి వాతావరణంతో కూడిన ఎడారి ప్రాంతాల్లో కూడా ఈ పరిజ్ఞానం భేషుగ్గా పని చేస్తున్నట్టు తేలింది! దీన్ని ప్రపంచపు దాహార్తిని తీర్చగల కీలక పరిణామంగా భావిస్తున్నారు.

రెటిక్యులర్ కెమిస్ట్రీతో…

గాలి నుంచి నీటిని సేకరించడంపై చేసిన పరిశోధనలకు ప్రొఫెసర్ యాగీకి 2025లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. కాలిఫోర్ని?నయాకు చెందిన ఆయన సొంత డీప్‌టెక్ కంపెనీ అటోకో గాలి నుంచి నీటిని సేకరించే టెక్నాలజీపై చాలాకాలంగా పరిశోధనలు చేస్తోంది. ఎడారుల వంటి అత్యంత పొడి వాతావరణంలో కూడా గాలి నుంచి అతి సులువుగా నీటిని తయారు చేయగల పారిశ్రామిక యంత్రాన్ని అటోకో తాజాగా రూపొందించింది. రెటిక్యులర్ కెమిస్ట్రీగా పిలిచే సాంకేతికత సాయంతో ఈ అద్భుతాన్ని సాధించింది. ఇందుకోసం అత్యంత శక్తిమంతమైన మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ (ఎంఓఎఫ్)లను రూపొందించింది. నానో టెక్నాలజీ సాయంతో రూపొందిన ఈ ఎంఓఎఫ్‌లను ఒకరకంగా నీటిని పీల్చుకునే స్పాంజీలతో పోల్చవచ్చు. కాకపోతే ఇవి అత్యాధునిక అణు స్పాంజీలన్నమాట. గాలిలోని తేమను, కనిపించని వాయువులను ఇవి శోషించుకుంటాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంప్రదాయిక అట్మ?మస్పియరిక్ వాటర్ జనరేటర్ల (ఏడబ్ల్యూజీ) ద్వారా గాలి నుంచి నీటిని సేకరించే ప్రక్రియ అత్యంత వ్యయ ప్రయాసలతో కూడినది. అందులో గాలిలోని తేమను నీటి బిందువులుగా మార్చే శీతలీకరణ స్థాయిని రాబట్టేందుకు సమీప వాతావరణం మొత్తాన్నీ కూలింగ్ ప్రక్రియ సాయంతో చల్లబరచాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆ యంత్రాలు భారీగా విద్యుత్‌ను వాడుకుంటాయి. కానీ ఎంఓఎఫ్‌లకు ఇలాంటివేమీ అవసరముండవు. అధిశోషణంగా పిలిచే సహజ ప్రక్రియ ద్వారా గాలిలోని నీటి అణువులను అవి నేరుగా ఆకర్షిస్తాయి. గాలిని బలవంతంగా చల్లబరిచే అవసరం లేకుండా గాలిలోని నీటి అణువులను ఎంఓఎఫ్‌లు నేరుగా తమకేసి ఆకర్షించుకుంటాయి.



మరోలా చెప్పాలంటే అవి రసాయనిక అయస్కాంతాల్లా పని చేస్తాయి. దాంతో నీటి అణువులు వాటి ఉపరితలాలపైకి వచ్చి అతుక్కుపోతాయి. యాగీ సరికొత్త రెటిక్యులర్ కెమిస్ట్రీ టెక్నాలజీకి మొత్తానికీ ఇదే అత్యంత కీలకం. అలా అతుక్కున్న నీటి అణువులను కొద్దిపాటి వేడి సాయంతో వాటిని ఎప్పుడు కావలిస్తే అప్పుడు కంటైనర్‌లోకి ఒడిసిపట్టుకోవచ్చు. అలా ఎలాంటి కాలుష్యమూ లేని అత్యంత స్వచ్ఛమైన నీరు సమకూరుతుంది. అంతేకాదు, ఈ ప్రక్రియంతా భారీ యంత్రాల బాదరబందీ లేకుండా అత్యంత సులువుగా, సహజంగా జరిగిపోతుంది. పైగా సూర్యుని నుంచి వచ్చే వేడి సాయంతోనే పని పూర్తవుతుంది. కనుక విద్యుత్కేంద్రాలు, భారీ పైపుల వంటివాటి అవసరమే ఉండదు! నీటికొరత ఉన్న ప్రాంతాల్లో షిప్పింగ్ కంటైనర్ పరిమాణంలో ఉండే ఎంఓఎఫ్ యంత్రం బిగించుకుంటే చాలన్నమాట.

ఎడారి నేలల్లోనూ…

సాంప్రదాయిక పద్ధతుల్లో గాలి నుంచి నీటిని తయారు చేయాలంటే తేమ శాతం కనీసం 45కు మించి ఉండాల్సిందే. లేదంటే అవి చేతులెత్తేస్తాయి. కనుక ఎడారుల వంటి అత్యంత పొడి ప్రదేశాలకు అవి పనికిరావు. కానీ గాల్లో తేమ 20 శాతం కంటే తక్కువగా ఉన్నా యాగీ టెక్నాలజీ భేషుగ్గా పని చేస్తుందని తేలింది. అంటే ఎన్నడూ వర్షమే కురవని, అత్యంత వేడి గాలులతో కూడిన ప్రాంతాల్లో కూడా దాని సాయంతో నీటిని తయారు చేసుకోవచ్చన్నమాట. ఎడారుల్లో గాలిలో నీటి అణువులు చాలా తక్కువగా ఉంటాయి. అటోకో రూపొందించిన ఎంవోఎఫ్‌లు రసాయన అయస్కాంతాలు తేమ 10 శాతం మాత్రమే ఉండే అత్యంత పొడి వాతావరణంలో కూడా నీటి అణువులను తమకేసి ఇట్టే ఆకర్షిస్తాయి.

భారత్‌లోనూ…

భారత్‌లో కూడా గాలి నుంచి నీటి తయారీకి అక్వో అనే దేశీయ కంపెనీ అట్మాస్పియరిక్ వాటర్ జనరేటర్ల (ఏడబ్ల్యూజీ)ను తయారు చేసింది. ఇవి అధునాతన సంక్షేపణ పరిజ్ఞానం సాయంతో పని చేస్తాయి. అవి గాలిని లోనికి పీల్చుకుంటాయి. అందులోని దుమ్ము, ధూళి వంటివాటిని తొలగించి శీతలీకరణ స్థాయికి చల్లబరిచి నీటిని సేకరిస్తాయి. దాన్ని కార్బన్ ఫిల్టరేషన్, యూవీ స్టెరిలైజేషన్ వంటి పలు దశల్లో శుభ్రపరిచి వినియోగానికి అనువుగా మారుస్తారు. అక్వో ఇప్పటికే మధ్యప్రదేశ్‌లోని హర్దువా మంగ్రా ప్రాంతంలో 1,500 మంది దాహార్తిని తీరుస్తోంది. హల్దియా రిఫైనరీకి ఈ పద్ధతిలో నీటిని సరఫరా కూడా చేస్తోంది. కాకపోతే ఈ విధానంలో నీటి ఉత్పత్తి ఉష్ణోగ్రత, గాల్లో తేమపై ఆధారపడి ఉంటుందని అక్వో వ్యవస్థాపకుడు, సీఈఓ నవ్‌కరణ్ సింగ్ బగ్గా వివరించారు. ఉ సాక్షి, నేషనల్ డెస్క్

..ఆ నేపథ్యమే ప్రేరణ

ప్రొఫెసర్ యాగీది అత్యంత దయనీయమైన నేపథ్యం. ఆయన జోర్డాన్‌లోని శరణార్థి శిబిరాల్లో పెరిగారు. నీటికి తీవ్ర కటకట అక్కడ అత్యంత సాధారణ దృశ్యం. దాంతో పెరిగి పెద్దవాడయ్యే క్రమంలో యాగీ నిత్యం దాహార్తినే చవిచూస్తూ వచ్చారు. తర్వాతి తరాలు తనలా గొంతెండి అల్లాడకుండా ఏదో చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నానని చెబుతారాయన. ఆ తపనతోనే రసాయన శాస్త్రంలో విశేషమైన కృషి చేస్తూ వచ్చారు. తన కెరీర్‌ను దానికే అంకితం చేశారు.

ఎన్నెన్ని ఉపయోగాలో…!

యాగీ రూపొందించిన వినూత్న ఎంఓఎఫ్ యంత్రాన్ని ప్రపంచానికి నీటి కొరతను సమూలంగా తీర్చగల వరదాయినిగా చెప్పవచ్చు…దనీటికొరత ఇప్పటికే అతి పెద్ద ప్రపంచ సమస్యల్లో ప్రధానమైనదిగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా 220 కోట్ల మంది సురక్షిత తాగునీటి సౌకర్యానికి దూరమైనట్టు ఐరాస చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎంఓఎఫ్ యంత్రాలు గేమ్‌చేంజర్లు కాగలవు. ఎందుకంటే గాలిలోని నీటి పరిమాణం ప్రపంచంలోని అన్ని నదుల్లోని నీటి కంటే ఏకంగా ఆరు రెట్లు అధికమని పలు అధ్యయనాలు తేల్చాయి. కనుక గాలి నుంచే నేరుగా నీటిని ఒడిసిపట్టుకోగలిగితే దాహార్తి సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టవచ్చు. పైగా ఈ పద్ధతి ద్వారా అత్యంత స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి వస్తుంది. పాతాళాన్ని తాకిన భూగర్భ జలాలపై, వాటర్ ట్యాంకులపై ఆధారపడటం తగ్గిపోతుంది.

## చివర్లోనూ చిక్కులు!

ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో చేపట్టిన పాలుమూరు-- రంగారెడ్డి ఎత్తిపోతలు పథుకానికి గ్రహణం వీడడం లేదు. కర్వెన మినహా చివరి దశలో ఉన్న నాలుగు రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల పనులు కొన్నిచోట్ల నత్తనడకన సాగుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా అటకెక్కాయి. నిధులు, పరిహారం చెల్లింపు సమస్యలే ఇందుకు ప్రధాన కారణం కాగా.. పనుల పూర్తికి సర్కారు మరోసారి డెడ్‌లైన్ (వచ్చే మార్చి) పొడిగించక తప్పని పరిస్థితి నెలకొంది.

చివరి దశలో 4 రిజర్వాయర్ల పనులు

మొదటి దశలో ఐదు రిజర్వాయర్లు.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్‌లో అంజనగిరి (6.80 టీఎంసీలు), వనపర్తి జిల్లా ఏదులలో వీరాంజనేయ (6.55 టీఎంసీలు), నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెంలో వెంకటాద్రి (16.58 టీఎంసీలు), మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కర్వెనలో కురుమూర్తిరాయ (19.15 టీఎంసీలు), జడ్చర్ల మండలంలోని ఉద్దండాపూర్ (15.91 టీఎంసీలు) నిర్మాణం చేపట్టారు. కర్వెన మినహా (ఇక్కడ నీళ్లు ఎత్తిపోయాల్సిన అవసరం లేదు) నాలుగు చోట్ల పంప్‌హౌస్‌లు నిర్మించారు. మొత్తంగా సుమారు ఏడాదిన్నర క్రితమే అంజనగిరి 100 శాతం, వీరాంజనేయ 95, వెంకటాద్రి 90, కర్వెన 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఏదులలో రిజర్వాయర్ కట్టకు రివిట్‌మెంట్, ఉద్దండాపూర్‌లో పంప్‌హౌస్ తవ్వకం, హెడ్ రెగ్యులేటరీ పనులు పూర్తి కాగా.. సర్జ్‌పూల్, పంప్‌హౌస్ కాంక్రీట్ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

ఆ 2.5 కి.మీ. పనులు పూర్తయితే జలకళ

నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు 16 కి.మీ.,ల సొరంగం పూర్తయింది. 8.3 కి.మీ.ల ఓపెన్ కెనాల్ నుంచి నీటిని తరలించాలి. ఇందులో కుడికుళ్ల, తిర్నాంపల్లి మధ్య 2.5 కి.మీ.,ల మేర మాత్రమే పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ సుమారు 15 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించాల్సి ఉండగా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఇది పూర్తయితే నార్లాపూర్ నుంచి కర్వెన వరకు అంటే నాలుగు రిజర్వాయర్లను నీటితో నింపే అవకాశం ఉంది.

ఇంకా అసంపూర్తిగా ఉన్నవి..

మొత్తం 18 ప్యాకేజీలకు గాను ప్యాకేజీ--12లో వట్టెం నుంచి కర్వెన వరకు ఓపెన్ కెనాల్ పనులు ఒక శాతుమే మిగిలాయి. ప్యాకేజీ--4లో నార్లాపూర్ నుంచి ఏదుముల వరకు టన్నెల్ నిర్మాణం



పూర్తి కాగా.. 2.74 కి.మీ. మేర గ్యాంట్రీ లైనింగ్ పూర్తి కావాలి. ప్యాకేజీ--7లో ఏదుల నుంచి వట్టెం వరకు 14.853 కి.మీ మేర (ఎడమ), 5.287 కి.మీ.,ల మేర (కుడి) సొరంగాల గ్యాంట్రీ లైనింగ్.. 2.94 కి.మీ.,ల మేర ఎడమ.. 0.339 కి.మీ.,ల మేర కుడి సొరంగం బెడ్ లైనింగ్ పనులు పూర్తికావాల్సి ఉంది.

తాగునీటి పనులు మాత్రమే..?

నార్లాపూర్ పంప్‌హౌస్‌లో ప్రత్యామ్నాయంతో కలుపుకొని మొత్తం 8 మోటార్లు కాగా ఇప్పటివరకు 4 అమర్చారు. నెలరోజుల్లో 2, 3, 4 పంప్‌ల డ్రైరన్ చేపట్టనున్నారు. ఏదులలో 10 మోటార్లకు గాను ఐదింటిని డ్రైరన్‌కు సిద్ధం చేశారు. వట్టెంలో 10 మోటార్లకుగాను నాలుగింటి డ్రైరన్ పూర్తవగా.. ఐదోది డ్రైరన్‌కు సిద్ధంగా ఉంది. ఉద్ధండాపూర్‌లో ఆరింటికి మూడింటి పనులు కొనసాగుతున్నాయి. అయితే ఈ పనులను తాగునీటి అవసరాలకు ఉపయోగపడేవేనని స్పష్టమవుతోంది.

నిధులు, పరిహార సమస్యలు..

నార్లాపూర్, ఏదులలో రిజర్వాయర్ల పరిధిలో ఇళ్లు, భూములు కోల్పోయిన ముంపు ప్రాంతాల నిర్వాసితులకు సంబంధించి పరిహార సమస్యలు ఉన్నాయి. బండరావిపాకులలో 18 ఏళ్లు నిండిన వారికి 300 ప్లాట్లు ఇవ్వాల్సి ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతోపాటు పరిహారం పక్కదారి పట్టిందంటూ ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. అలాగే కొల్లాపూర్ మండలంలోని ముంపు ప్రాంతాలైన సున్నపుతండా, ఒడ్డె గుడిసెల్లో నిర్వాసితులకు పరిహారం చెల్లించలేదు. ఫలితంగా ఆయా ముంపు ప్రాంతాల వారు ఖాళీ చేయకుండా అక్కడే నివసిస్తున్నారు. దీంతో ఆయా రిజర్వాయర్ల పరిధిలో మోటార్లు డ్రైరన్‌కు సిద్ధంగా ఉన్న ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. వట్టెంలో సుమారు రూ.200 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉండడంతో పనులు ముందుకు కదలడం లేదని తెలుస్తోంది.

ప్రాజెక్టు వివరాలు

పరిపాలన అనుమతులు: 10.06.2015

లబ్ధి పొందే జిల్లాలు: 6 (నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ)

పనుల ప్రారంభం: 2015 జూన్ 11(భూత్పూర్ మండలం కర్వెనలో ప్రాజెక్టు పైలాన్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు)

సాగు నీరందించే లక్ష్యం : 12.30 లక్షల ఎకరాలు

తాగునీరు అందే ప్రాంతాలు: 70 మండలాలు, 1,226 గ్రామాలు

వ్యయ వివరాలు ఇలా..


అంచనా వ్యయం: రూ.35,200 కోట్లు

సవరించిన వ్యయం: రూ.55,086 కోట్లు

సర్కారు తాజా అంచనా: రూ.80,000 కోట్లు

## చిగురాశలపై పిడుగుపాటు

సమాజంలో ఉండే అసమానతలకూ, అంతరాలకూ చట్టాల ద్వారా, మధ్యవర్తిత్వంతో సహా ఇతరేతర మార్గాల ద్వారా సామరస్యపూర్వకమైన పరిష్కారం సాధించటం రాజ్యం చేయాల్సిన పని. అందుకు రాజ్యాంగం, దాని ద్వారా ఏర్పడే భిన్న వ్యవస్థలు పనిచేస్తుంటాయి. కుటుంబాల్లో తరాల మధ్య తలెత్తే సమస్యలకు కూడా ఆ పరిధిలోనే పరిష్కారాలుంటాయి. ఇతరత్రా సమస్యల మాటేమో గానీ, పెళ్లి విషయంలో మాత్రం అదేం కుదరదంటున్నది గుజరాత్ ప్రభుత్వం. వివాహం గురించి తల్లిదండ్రులకు చెప్పి, వాళ్ల అనుమతి తీసుకోవాలని ఆంక్షలు విధించటానికి సిద్ధపడుతోంది. ఇందుకోసం 2006 నాటి వివాహ నమోదు చట్టాన్ని సవరించదల్చుకున్నట్టు ప్రకటించింది. పరస్పరం ఇష్టపడి పెళ్లాడాలనుకునే జంటలకు ఇప్పటికే అనేకానేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. కులాలు, మతాలు, ప్రాంతాలు, ఆర్థిక అసమానతలు అందులో కొన్ని. ఈ గోదాలోకి తాను కూడా జొరబడి గుజరాత్ సర్కారు ఏం సాధించదల్చుకున్నదో అనూహ్యం. ప్రజాస్వామ్యంలో 18 ఏళ్ల వయసు నిండినవారు ఓటేయటానికి, పోటీ చేయటానికి అర్హులు. ప్రభుత్వాలను మార్చవచ్చు. జనం ఆమోదం పొంది ఎన్నికైతే ప్రభుత్వంలో భాగమై విధానాలు రూపొందించవచ్చు. కానీ ఆ వయసువారు తమకు నచ్చిన భాగస్వామిని ఎంచుకోవటానికి వీల్లేదని, అందుకు మరొకరి ఆమోదముద్ర తప్పనిసరని అనటం ఆశ్చర్యకరం. ఇలాంటి తలకిందుల ఆలోచనలు చేయటం గుజరాత్‌తోనే మొదలు కాలేదు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు ఈ పనే చేశాయి. ఎనిమిదేళ్ల క్రితం కేరళకు చెందిన హదియా అనే యువతి కేసులో… తనకు నచ్చిన జీవితభాగస్వామి ఎవరో నిర్ణయించుకునే స్వేచ్ఛ మైనారిటీ తీరిన ప్రతి ఒక్కరికీ ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ బంధంలో తల్లిదండ్రులు గానీ, కుల మత పెద్దలు గానీ జోక్యం చేసుకోవడం చెల్లదని చెప్పింది. నచ్చిన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవటం రాజ్యాంగం 21వ అధికరణం ద్వారా ప్రసాదించిన జీవించే హక్కులో భాగమని కూడా తెలిపింది. 2021లో అలహాబాద్ హైకోర్టు, కర్ణాటక హైకోర్టులు సైతం ఈ సంగతినే స్పష్టం చేశాయి. గత వారం గుజరాత్ అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి వివాహ నమోదు చట్టాన్ని సవరించాలనుకోవటానికి చూపిన కారణాలు హాస్యాస్పదమైనవి. పెళ్లిళ్ల నమోదు నిబంధనల్ని కఠినతరం చేయాలని



వివిధ సామాజిక సంస్థల నాయకుల నుంచి వినతులొచ్చాయట. బాధ్యతాయుతమైన ప్రభుత్వమైతే అది అసాధ్యమని వారికి నచ్చజెప్పాలి. వివాహాల నమోదు చట్టం రాష్ట్రాల పరిధిలోనే ఉంటుంది. దాన్ని సవరించే హక్కు కూడా ఉంటుంది. కానీ అది రాజ్యాంగానికి లోబడి ఉండాలి. అసలు ఇప్పుడు తీసుకురాదల్చుకున్న సవరణల్లో స్పష్టత లేదు. పెళ్లి గురించి తల్లిదండ్రులకు చెప్పారా లేదా అని అడగటం, వారికి చెప్పాలని నిబంధన విధించటం తప్ప వారు అంగీకరించని పక్షంలో చట్టం ఏం చేస్తుందో, పర్యవసానాలెలా ఉంటాయో చెప్పటం లేదు. పెళ్లి నమోదు చేస్తారా లేదా అన్న విషయంలో స్పష్టత ఇవ్వలేదు. ఇది అతి తెలివి. ఏదో రకంగా పెళ్లి సంగతి తల్లిదండ్రుల చెవినబడితే చాలు… ఆ తర్వాత వాళ్లూ వాళ్లూ పడతారని చేతులు దులుపుకోవటం! ఇలాంటి సందర్భాల్లో మన దేశంలో ఏమవుతున్నదో కనబడుతూనే ఉంది.

తమ కులంవాడు కాదని, 'తక్కువ' కులస్థుడని అనుకున్న మరుక్షణం హంతకులుగా మారు తున్న తల్లిదండ్రులు కోకొల్లలు. కనీసం ఇప్పుడైతే కొంత కాలం గడిచాకనో, బిడ్డ పుట్టాకనో ఆవేశం తగ్గించుకుని అక్కున చేర్చుకుంటున్నవారు అక్కడక్కడ కనబడు తున్నారు. ఈ చట్టం కనీసం అందుకు కూడా అవకాశం ఇవ్వదల్చుకున్నట్టు లేదు. కొన్నేళ్ల క్రితం 'లవ్ జిహాద్' మాట తెగ ప్రచారం చేశారు. ప్రేమ పేరిట మతాంతీకరణ జరుగుతున్నదని భూమ్యాకాశాలు ఏకం చేశారు. 'కేరళ ఫైల్స్' చిత్రం దాని ఆధారంగానే నిర్మించారు. కానీ ఆ వంకన మతాంతర వివాహాలను వివాదాస్పదం చేయటం తప్ప సాధించిందేమీ లేదు. రాజకీయపక్షాలు తమ ప్రయోజనాల కోసం ఏమైనా చెబుతాయి. రాజ్యం అలాంటి అంశాల్లో ఆచితూచి వ్యవహరించాలి. ఉన్న సమస్యల్ని పెంచకూడదు. తానే సమస్యగా మారకూడదు.

# సెకండ్ ఇన్నింగ్స్ కు సమంత ప్రీ ప్లాన్స్





ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన సమంత రుత్ ప్రభు కెరీర్ ఇప్పుడు మరో కీలక మలుపు తిరిగే దశలో ఉంది. వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలు, మొదటి వివాహం, అనంతర విడాకులు, ఆరోగ్య సమస్యలు, ఆమె సినీ కెరీర్ ను కాస్త నెమ్మదించేలా చేశాయి. అయితే ఇప్పుడు మళ్లీ వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సమంత, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగేందుకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కానీ ఈసారి ఆమె తీసుకుంటున్న నిర్ణయాలు గతానికి భిన్నంగా ఉన్నాయి.

## మా ఇంటి బంగారంకు రాజ్ క్రియేటివ్ ఇన్‌పుట్స్

సమంత ప్రస్తుతం మా ఇంటి బంగారం అనే సినిమా చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ఆమె భర్త రాజ్ నిడిమోరు ప్రెజెంటర్‌గా ఉండటమే కాకుండా క్రియేటివ్ ఇన్‌పుట్స్ కూడా ఇస్తున్నట్టు సమాచారం. రాజ్–డీకే జంట ఇప్పటికే అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ వంటి ప్రముఖ ఓటీటీ వేదికలపై సక్సెస్‌ఫుల్ వెబ్ సిరీస్‌లతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంతో సమంత కూడా తన కెరీర్ దిశను ఓటీటీ వైపు మళ్లిస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది.

## వెబ్‌సిరీస్ ఆసక్తి

ఇటీవల ఆమెను సంప్రదిస్తున్న దర్శకులకు కేవలం సినిమాల కథలు కాకుండా వెబ్ సిరీస్ కాన్సెప్ట్‌లను కూడా తీసుకురావాలని సమంత సూచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇది కేవలం ట్రెండ్‌ను అనుసరించడం మాత్రమే కాకుండా వ్యూహాత్మక నిర్ణయంగా కూడా భావించవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో సిల్వర్ స్క్రీన్ హీరోయిన్లకు తీవ్ర పోటీ ఉంది. పైగా సమంత గతంలో చేసిన గ్లామర్, కమర్షియల్ పాత్రల తరహా పాత్రలను ఇప్పుడు తిరిగి చేయాలనే ఉద్దేశం ఆమెకు లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఓటీటీ వేదికలు మాత్రం కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే స్థలంగా మారాయి. వయస్సు, ఇమేజ్ పరిమితులు లేకుండా విభిన్న పాత్రలను పోషించే అవకాశాలు అక్కడ ఎక్కువగా ఉన్నాయి. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' ద్వారా ఇప్పటికే పాన్–ఇండియా స్థాయిలో తన ప్రతిభను చాటుకున్న సమంతకు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు మరింత విస్తృతమైన అవకాశాలను అందించగలవు. అంతేకాదు, థియేటర్లలో ఇటీవల స్టార్ హీరోయిన్ల సినిమాలకు కలెక్షన్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం కూడా ఒక వాస్తవం. ఈ నేపథ్యంలో సమంత తీసుకుంటున్న ఈ కొత్త దారి ఆమె కెరీర్‌కు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించవచ్చు. స్టార్ ఇమేజ్ కంటే కంటెంట్ ఆధారిత పాత్రలను ఎంచుకుంటూ, ఓటీటీ–థియేటర్ మధ్య సమతుల్యత సాధించే ప్రయత్నంలో సమంత ఉన్నట్టు కనిపిస్తోంది. మొత్తానికి, సమంత రెండో ఇన్నింగ్స్‌ను మరింత ప్లాన్డ్‌గా,

## కథలపై సమంత


వ్యూహాత్మకంగా ఆడేందుకు సిద్ధమవుతోంది.



# ఫ్లాపుల్లో ఉన్న స్టార్ హీరోని బయటపడేసే రియల్ హీరో ఇతడేనా?

అతడు ముసలోడు.. పనైపోయిందని అనుకున్నారు--.. కానీ అతడు లేట్ ఏజ్‌లోను భళ్లూక పట్టు పడుతున్నాడు! బ్యాక్ టు బ్యాక్ బ్లాక్ బస్టర్లతో మతులు పోయే ట్రీటిస్తున్నాడు. ఇంతకీ ఈ లేటు వయసు ఘాటు హీరో ఎవరో పరిచయం చేయాలా? బాలీవుడ్ వెటరన్.. ది గ్రేట్ సన్నీడియోల్ గురించే ఇదంతా. వరుస సీక్వెల్స్‌తో దుమ్ము లేపుతున్న సీనియర్ హీరో సన్నీడియోల్ ఇటీవలే -బార్డర్ 2–తోను బంపర్ హిట్టు కొట్టాడు. ఇంతకుముందు గద్దర్ 2 అతడి కెరీర్ కంబ్యాక్ అవ్వడానికి బిగ్ బూస్ట్ ఇచ్చింది. పూర్తిగా డియోల్ శకం ముగిసింది! అనుకుంటున్న తరుణంలో కొన్నేళ్ల పాటు బయటి ప్రపంచానికి కనిపించని సన్నీడియోల్.. ఉన్నట్టుండి గద్దర్ 2 తో సక్సెస్ స్ట్రీక్ లోకి దూసుకొచ్చాడు. గద్దర్ 2 చిత్రం 500కోట్ల క్లబ్ లో చేరింది. ఇప్పుడు మరో సీక్వెల్ చిత్రం బోర్డర్ 2 కూడా ఏకంగా 400కోట్లు వసూలు చేయడం ఒక సంచలనం. ఇలాంటి తరుణంలో ఇప్పుడు అతడు నటించిన లాహోర్ సీక్వెల్ -లాహోర్ 1947- విడుదలకు సిద్ధమవుతోంది. లేటు వయసులో దుమ్ము లేపుతున్న స్టార్ హీరో ఈసారి తన స్నేహితుడు అమీర్ ఖాన్ తో కలిసి పని చేస్తుండడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. బాలీవుడ్‌లో ఇప్పుడు అందరి దృష్టి -లాహోర్ 1947–పైనే ఉంది. వరుస పరాజయాలతో సతమతమవుతున్న మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. అతడిని మళ్ళీ ఫామ్‌లోకి వచ్చిన మాస్ హీరో సన్నీ డియోల్ గట్టెక్కిస్తాడా? అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. చాశ్రీంశీ =ఘుం - సెకండ్ ఇన్నింగ్స్ కు సమంత ప్రీ ప్లాన్స్ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అమీర్ ఖాన్‌కు ఇది చాలా కీలకమైన సినిమా. -లాల్ సింగ్ చడ్డా- ఫ్లాప్ తర్వాత అమీర్ నిర్మాతగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. లాహోర్ సీక్వెల్ కి రాజ్ కుమార్ సంతోషి దర్శకత్వం వహిస్తుండటంతో దీనిపై మరిన్ని అంచనాలు పెరిగాయి. ఇక సన్నీ డియోల్ - రాజ్‌కుమార్ సంతోషి కాంబినేషన్ (ఘాయల్, ఘాతక్, దామిని) అంటేనే బాక్సాఫీస్ వద్ద ఒక సెన్సేషన్. దానికి అమీర్ ఖాన్ నిర్మాణ విలువలు తోడవ్వడం సినిమాపై భారీ అంచనాలను పెంచింది. గద్దర్ 2తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన సన్నీ డియోల్ -బోర్డర్ 2–తోను మరో బ్లాక్ బస్టర్ కొట్టారు. ఇప్పుడు -లాహోర్ 1947- కూడా హిట్ అయితే పీరియడ్ డ్రామాతో అతడు హ్యాట్రిక్ కొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమా ఆగస్టు 13న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా విడుదల కానుంది. దేశభక్తి నేపథ్యంలో సాగే సినిమాలకు ఆగస్ట్ 15 మంచి సీజన్. -గద్దర్ 2- కూడా ఇదే సమయంలో వచ్చి రికార్డులు సృష్టించింది. అందువల్ల ఇప్పుడు లాహోర్ సీక్వెల్ కూడా ఘనవిజయం సాధిస్తుందని భావిస్తున్నారు. ఈ చిత్రంతో చాలా కాలం తర్వాత ప్రీతి జింటా రీఎంట్రీ ఇస్తుండటం ప్రేక్షకుల్లో మరో ఆకర్షణగా మారింది. విభజన కాలం నాటి ఎమోషనల్ పీరియడ్ డ్రామాలో ప్రీతి పాత్ర ఏమిటన్నది వేచి చూడాలి. అమీర్ ఖాన్ జాతకం మారుతుందా? వరుస బ్లాక్ బస్టర్లతో దూకుడు మీద ఉన్న సన్నీడియోల్.. ఫ్లాపుల్లో ఉన్న తన స్నేహితుడు అమీర్ ఖాన్ జాతకం మార్చేస్తాడని అంతా భావిస్తున్నారు. అమీర్ ఖాన్ లాహోర్ 1947 చిత్రానికి కేవలం నిర్మాతగానే కాకుండా, ఈ సినిమాలో ఒక ముఖ్య పాత్రలో కనిపిస్తారని టాక్ ఉంది. కంటెంట్ మీద విపరీతమైన పట్టున్న రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వం వహించడం ప్లస్ కాగా, సన్నీ డియోల్ మాస్ ఇమేజ్‌ను సరిగ్గా వాడుకుంటే ఇది అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్‌కు పూర్వ వైభవం తీసుకురావడం ఖాయమని అంచనా వేస్తున్నారు. 60 ప్లస్ వయసులోనూ బ్యాక్ టు బ్యాక్ హిట్లు కొడుతూ డియోల్ సాబ్ నిజంగా ఆదర్శంగా మారారు.

# ఏఐ మార్ఫింగ్ కి చెక్?.. స్పెషల్ ప్లాన్ తో స్టార్ హీరోయిన్స్!



టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్లకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను పర్మిషన్ లేకుండా సోషల్ మీడియాలో ఎక్కువగా యూజ్ చేస్తున్న వేళ.. పలువురు యాక్ట్రెస్ లు కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఎక్స్ సహా పలు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ సహాయంతో పిక్స్ ను మార్ఫ్ చేసి వైరల్ చేయడం వారిలో ఆందోళన కలిగిస్తోంది. రీసెంట్ గా కొందరు స్టార్ హీరోయిన్ల ఫోటోలు ఏఐ టెక్నాలజీతో మార్ఫింగ్ చేసి ట్రెండ్ చేయడం చర్చనీయాంశమైంది. యంగ్ బ్యూటీ ఆషికా రంగనాథ్ కు సంబంధించిన బికినీ పిక్స్ తోపాటు రష్మిక మందన్న పుష్ప 2 సినిమాలోని సాంగ్స్ స్టిల్స్ ను ఏఐ ద్వారా మార్ఫ్ చేసి కొందరు నెటిజన్లు పోస్ట్ చేశారు. ఫేస్ మాత్రం అదే ఉంచి.. మిగతా పార్ట్స్ కు సంబంధించి మార్పులు చేసి ఫేక్ ఫోటోస్ ను వైరల్ చేయడం.. హీరోయిన్లకు అసౌకర్యానికి గురి చేస్తోంది. దీంతో ఇలాంటి ఘటనలపై పలువురు హీరోయిన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పర్సనల్ రెస్పెక్ట్, ప్రైవసీకి భంగం కలిగేలా మార్ఫింగ్ లు జరుగుతుండటంతో.. అంతా కలిసి రెస్పాండ్ అవ్వాలని భావిస్తున్నారట. అందుకే త్వరలో కొందరు స్టార్ హీరోయిన్స్ అంతా కలిసి ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి, తదుపరి చర్యలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో కేవలం పర్సనల్ గా రెస్పాండ్ అవ్వడం కన్నా.. ఒక టీమ్ గా ఏర్పడి అఫీషియల్ గా ప్రభుత్వాన్ని ఆశ్రయించాలని ప్లాన్ చేస్తున్నారట. ఏఐ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టపరమైన రక్షణ కల్పించాలని.. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లకు నిబంధనలు పెంచాలని కోరనున్నట్లు సమాచారం. ఇప్పటికే దేశంలో సైబర్ రూల్స్ ఉన్నప్పటికీ.. అవి మార్ఫింగ్ పిక్స్ ను అడ్డుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే సెలబ్రిటీలే కాకుండా సాధారణ మహిళలు కూడా ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. ఆ అంశంపై పెద్ద ఎత్తున చర్యలు అవసరమని సినీ ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. స్టార్ హీరోయిన్లు ముందుకు వచ్చి పోరాటం చేస్తే... ఇతరులకు కూడా రక్షణ కలిగే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారట. ఏదేమైనా ఇప్పుడు ఆ విషయంపై సోషల్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. ప్రస్తుతం అన్ని రంగాలను ఏలుతున్న ఏఐ టెక్నాలజీ అభివృద్ధి ఎంత ఉపయోగకరమో.. దాని దుర్వినియోగం అంత డేంజర్ అని ఇప్పటికే పలు ఘటనలు ప్రూవ్ చేశాయి. ఇప్పుడు పర్సనల్ రెస్పెక్ట్ ను కాపాడుకునేందుకు పలువురు హీరోయిన్లు తీసుకునే చర్యలపై సినీ వర్గాలతో పాటు అభిమానుల్లో కూడా ఆసక్తి నెలకొంది. త్వరలోనే ఆ విషయంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# మళ్లీ రేస్‌కు రెడీ అవుతున్న కల్యాణ్‌రామ్!



కెరీర్ ప్రారంభం నుంచి న్యూ టాలెంట్‌ని ఎంకరేజ్ చేస్తూ వస్తున్నారు హీరో నందమూరి కల్యాణ్ రామ్. ఈ ప్రయాణంలో బ్లాక్ బస్టర్ హిట్‌లతో పాటు భారీ డిజాస్టర్లని కూడా చవి చూశారు. అయినా సరే కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేయడం మాత్రం ఆపలేదు. అతనొక్కడే, హరే రామ్, పటాస్ వంటి సినిమాలతో టాలెంటెడ్ డైరెక్టర్స్‌ని ఇండస్ట్రీకి అందించారు. కల్యాణ్ రామ్ పరిచయం చేసిన అనిల్ రావిపూడి ఇప్పుడు వరుస బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకుంటూ హిట్ మెషీన్ అనిపించుకుంటున్నారు. చాశ్రీంశీ =ఘుం - ఫ్లాపుల్లో ఉన్న స్టార్ హీరోని బయటపడేసే రియల్ హీరో ఇతడేనా? ఇదే తరహాలో మరి కొంత మంది డైరెక్టర్లని పరిచయం చేశారు కానీ పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఫ్లాపులు ఎదుర్కోవాల్సి వచ్చింది. -బింబిసార–తో వశిష్టని దర్శకుడిగా పరిచయం చేసి సూపర్ హిట్ అందుకున్నారు. మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఆ తరువాత కూడా ముగ్గురు కొత్త డైరెక్టర్లని పరిచయం చేస్తూ కల్యాణ్ రామ్ చేసిన ప్రయోగాలు -అమిగోస్–, ది డెవిల్, అర్జున్ సన్నాఫ్ వైజయంతీ తీవ్ర నిరాశకు గురి చేశాయి. సక్సెస్ అవుతాయని కల్యాణ్ రామ్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టలేకపోయాయి. చాశ్రీంశీ =ఘుం - రణ్ వీర్ (శ) హృతిక్ రోషన్.. ఎవరు బెస్ట్ డాన్? దీంతో దాదాపు ఏడాది బ్రేక్ ఇచ్చిన కల్యాణ్ రామ్ మళ్లీ రేస్‌కు రెడీ అవుతున్నాడు. ఈ సారి కూడా మరో కొత్త దర్శకుడికి అవకాశం ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. కల్యాణ్ రామ్ దర్శకుడిగా పరిచయం చేయబోతున్నది మరెవరినో కాదు పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించి రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టిన -పుష్ప–, -పుష్ప 2– చిత్రాలకు డైలాగ్స్ అందించిన రైటర్ శ్రీకాంత్ విస్సా ని దర్శకుడిగా పరిచయం చేయబోతున్నాడు.



దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ఆల్ రెడీ స్టార్ట్ అయింది. చాశ్రీంశీ =ఘుం - సెకండ్ ఇన్నింగ్స్ కు సమంత ప్రీ ప్లాన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని -అర్జున్ సన్నాఫ్ వైజయంతీ- ముప్పా అశోక్ వర్ధన్ నిర్మించబోతున్నాడని తెలిసింది. పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ -పుష్ప–తో పాటు పలు హిట్ సినిమాలకు డైలాగ్స్ అందించిన శ్రీకాంత్ విస్సా చెప్పిన కథ నందమూరి కల్యాణ్‌రామ్‌కు ఎంతగానో నచ్చిందట. గత ఏడాది ఎండింగ్‌లోనే ఈ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినా షూటింగ్‌ని మాత్రం 2026లోనే మొదలు పెట్టాలని ఇన్ని రోజులు ఆగారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక అప్ డేట్‌ని రిలీజ్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. హిట్ సినిమాల రైటర్గా పేరు తెచ్చుకున్న శ్రీకాంత్ విస్సా ఈ సినిమాతో నందమూరి కల్యాణ్ రామ్‌ని మళ్లీ రేస్‌లోకి తీసుకొస్తాడా అన్నది వేచి చూడాల్సిందే.

# మిల్క్ బ్యూటీ వివాదం ముగిసిపోయిందా?



సినీ స్టార్లు, సెలబ్రిటీలు సినిమాల్లో నటిస్తూనే సైడ్ బిజినెస్ కూడా చేస్తుండటం తెలిసిందే. మూవీస్ పరంగా కోట్లల్లో పారితోషికాలు తీసుకుంటున్న స్టార్స్ దానికి మించి కమర్షియల్ యాడ్‌లకు దక్కించుకుంటున్నారు. ప్రముఖ బ్రాండ్‌లకు ప్రచార కర్తలుగా వ్యవహరిస్తూ తద్వారా ఆయా కంపనీల సేల్స్ తమ క్రేజ్‌తో పెంచేస్తున్నారు. టాలీవుడ్ టు బాలీవుడ్ వరకు స్టార్ హీరోలు, హీరోయిన్‌లు, ప్రకాష్ రాజ్, సోనూసూద్ లాంటి క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా బ్రాండ్‌లలో దూసుకుపోతున్నారు. క్రేజీ బ్రాండ్‌లకు బ్రాండ్ అంబాసిడర్‌లుగా పని చేస్తున్నారు. తెలుగులో రామ్‌చరణ్ నుంచి నాని వరకు పూజా హెగ్డే నుంచి అనుపమ పరమేశ్వరన్ వరకు ఇప్పటికే వివిధ బ్రాండ్‌లకు ప్రచార కర్తలుగా వ్యవహరిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంలో కొంత మంది వివాదాలని ఎదుర్కొంటుంటే మరి కొంత మంది మాత్రం వివాదాలకు దూరంగా ఉంటూ తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇదిలా ఉంటే మిల్క్ బ్యూటీ తమన్నా కూడా ఈ జాబితాలో చేరింది. జపనీస్ కాస్మెటిక్స్ నుంచి ఫాంటా వరకు పదికి పైనే ప్రముఖ బ్రాండ్‌లకు ప్రచార కర్తగా వ్యవహరిస్తోంది. తాజాగా ఈ బ్యూటీ ఖాతాలోకి మరో ప్రతిష్టాత్మకమైన బ్రాండ్ వచ్చి చేరింది. అదే -మైసూర్ సాండల్ సోప్–. గత కొన్ని దశాబ్దాలుగా ప్రముఖ బ్రాండ్‌లలో ఒకటిగా పాపులారిటీని, ప్రజల నమ్మకాన్ని సొంతం చేసుకుని ఇప్పటికీ అదే క్రేజ్‌ని సొంతం చేసుకుని రికార్డు స్థాయిలో సేల్స్ జరుగుతున్న -మైసూర్ సాండల్ సోప్–కు మిల్క్ బ్యూటీ తమన్నా బ్రాండ్ అంబాసిడర్‌గా ఖరారైంది. కర్ణాటక ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే -మైసూర్ సాండల్ సోప్– ఉత్పత్తిని ప్రభుత్వమే కొన్ని దశాబ్దాలుగా చూసుకుంటోంది. అలాంటి ఈ ప్రోడక్ట్‌కు తమన్నా అయితే బాగుంటుందని కర్ణాటక ప్రభుత్వం తనని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. దీనిపై గత కొంత కాలంగా కర్ణాటకలో నిరసనలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ ప్రాంతానికి చెందని వ్యక్తిని ఎలా బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తారని, ఆ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పలువురు ప్రభుత్వానికి సూచించారు. అయినా సరే ప్రభుత్వం ఎనక్కి తగ్గలేదు. తమన్నానే బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తూ తాజాగా ఆమెతో కాంట్రాక్ట్‌ని కుదుర్చుకోవడం విశేషం. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ బిజీగా ఉంది. షాహిద్ కాపూర్ -ఓ రోమియో–తో పాటు మరియా ఐపీఎస్, వి శాంతారామ్ బయోపిక్, సిద్దార్థ్ మల్హోత్రా -వీవాన్–, రేంజర్ సినిమాల్లో నటిస్తోంది. ఇందులో షాహీద్ కపూర్ హీరోగా విశాల్ భరద్వాజ్ రూపొందిస్తున్న రొమాంటిక్ యాక్షన్ డ్రామా -ఓ రోమియో–లో ఎలాంటి పారితోషికం తీసుకోకుండా తమన్నా నటించిన విషయం తెలిసిందే.

# శక్తిమంతమైన కథలో?

'టాక్సిక్' చిత్రంలో నదియాగా ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతోంది అందాల తార కియారా అద్వాణీ. ప్రస్తుతం మాతృత్వపు దశను ఆస్వాదిస్తున్న ఈమె.. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. "బరేలీ కీ బర్ఫీ', 'పంగా' లాంటి హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకురాలు అశ్వినీ అయ్యర్ తివారీతో ఓ ప్రాజెక్టు కోసం చేతులు కలిపిందట కియారా. "ఇప్పుడు రాబోయే ప్రాజెక్టు ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. ఇప్పటికే దీని గురించి కియారా, దర్శకురాలి మధ్య చర్చలు పూర్తయ్యాయి. ఈ చిత్రాన్ని శక్తిమంతమైన మహిళా ప్రాధాన్య కథగా తీర్చిదిద్దనున్నారు. కియారా 'టాక్సిక్' చిత్ర షూటింగ్‌ను పూర్తి చేసిన తర్వాత ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారిక ప్రకటన



వెలువడే అవకాశాలున్నాయ"ని కియారా సన్నిహిత వర్గాలు తెలిపాయి.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .